
J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 17.07.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 07 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## భయపడకుండా..
# కరోనాతో కలబడదాం

- ధైర్యంగా ఉండాలంటున్న డాక్టర్లు
- స్వీయ నిర్బంధమే ముఖ్యమంటున్న ప్రభుత్వం
- భౌతిక దూరం, మాస్కు ధారణ, శానిటైజర్లతో ప్రక్షాళనే రక్షణ సూత్రాలు

**ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా రాకాసి..ఎక్కడో చైనాలో మొదలై..చూస్తుండగానే మన ఊరికి, మన వీధికి, మన గడప దగ్గరికి కూడా వచ్చేస్తోంది. దీంతో ప్రజలు ఈ ప్రాణాంతక వ్యాధిని చూసి భయపడుతున్నారు. ఎప్పుడు ఏమవుతుందోనని హడలిపోతున్నారు. అయితే, ఈ భయంతోనే ఆందోళనకు, మానసిక వత్తిళ్ళకు గురై లేనిపోని అనారోగ్యాలు తెచ్చుకుని నానా అవస్థలు పడుతున్నవారూ లేకపోలేదు. ఈ వ్యాధి ప్రాణాంతకమే అయినప్పటికీ భయపడాల్సిన అవసరం లేదు. భయపడి ప్రయోజనం లేదు కూడా.. గుండెధైర్యం ఉంటే ఏ వ్యాధీ మనల్ని ఏమీ చేయలేదు. వైద్యులు, ప్రభుత్వాల సూచనలతో కరోనాను ధీటుగా ఎదుర్కోవడమే ఇప్పుడు మన ముందున్న తక్షణ కర్తవ్యం.**

దాదాపు గత నాలుగు నెలలుగా ప్రపంచమంతా కరోనా మహమ్మారి దెబ్బకు అదిరిపోతోంది. ఈ వ్యాధి విలయ తాండవంతో అంతా అల్లకల్లోలంగా మారింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఈనెల 15వ తేది నాటికి కోటీ 35లక్షలా 73వేలా288 మంది ఈ వ్యాధి బారినపడి అల్లాడుతున్నారు. అంతేగాదు, 5లక్షలా 83వేలా 655 మంది ఈ వ్యాధితో ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెప్తున్నాయి. మనదేశంలో కూడా కోవిడ్ వైరస్ మహా ఉధృతంగా ఉంది. ఇప్పటికే కేసుల సంఖ్య 9 లక్షలా 36వేలు దాటింది. మరణాల సంఖ్య 24వేలకుపైగానే ఉంది. దీంతో కోవిడ్ వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రపంచమంతా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. లక్షలాదిమంది వైద్యులు తమ (మిగతా 11వ పేజీలో)

## శేషగిరిబాబుకు సెలవు...
# చక్రధర్‌బాబుకు కొలువు

- కమిషనర్‌గా వెళ్లి కలెక్టర్‌గా వచ్చిన చక్రధర్






**జిల్లాకు కొత్త కలెక్టర్‌గా కెవిఎన్ చక్రధర్‌బాబు నియమితులయ్యారు. ఏపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న చక్రధర్‌బాబును నెల్లూరుజిల్లాకు కలెక్టర్‌గా నియమిస్తూ ఈనెల 15వ తేది రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఉత్తర్వులు జారీచేశారు.**

2011 బ్యాచ్‌కు చెందిన చక్రధర్‌బాబు ఆరేళ్ళ కిందట నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కూడా పనిచేయడంతో ఈ జిల్లాపై ఆయనకు మంచి అవగాహన ఉంది. మునిసిపాలిటీ స్థాయి నుండి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన తరువాత నెల్లూరు నగర కార్పొరేషన్‌కు ఆయనే తొలి, చివరి ఐఎఎస్ అధికారి. ఆయన తరువాత మళ్ళీ కార్పొరేషన్‌కు ఏ ఐఎఎస్ అధికారీ రాలేదు. (మిగతా 11వ పేజీలో)

# పెరగనున్న జిల్లాలు

- ముక్కలుగా నెల్లూరు



## సర్వేపల్లి, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరిలతో కలిసి తిరుపతి జిల్లాగా ఏర్పడితే నెల్లూరుకు తీవ్ర నష్టమే!

***రాష్ట్రంలో కొత్తజిల్లాల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోద ముద్ర పడిపోయింది. 2019లో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డప్పటినుండి కొత్త జిల్లాల ఏర్పాటు ప్రస్తావన తరచూ వినపడుతూనే ఉంది. ఎట్టకేలకు 15వ తేదీ బుధవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేస్తూ ఆమోదం తెలిపారు.***

ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మారుస్తారని మొదటి నుండి వినపడుతూనే వుంది. అదే ప్రతిపాదనతో ముందుకు వెళ్తారా... లేక కొత్త ఆలోచనలకు కసరత్తు చేస్తారా...? అన్నది వేచి చూడాలి.

అయితే పార్లమెంటు నియోజక వర్గాల ప్రాతిపదికగా జిల్లాలను ఏర్పాటు చేస్తే ఎక్కువగా నష్టపోయేది నెల్లూరే. తిరుపతి పార్లమెంటు పరిధిలోకి సర్వేపల్లి, సూళ్లూరు పేట, గూడూరు, వెంకటగిరి నియోజక వర్గాలు వస్తాయి. ఈ నాలుగు నియోజక వర్గాలు తిరుపతి జిల్లాలోకి వెళ్తే సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ప్రపంచ ప్రఖ్యాత రాకెట్ కేంద్రం సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) , భారతదేశంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్ఇజడ్) శ్రీసిటీ, నాయుడుపేట ప్రాంతంలోని అన్ని పారిశ్రామిక వాడలు, సర్వేపల్లి నియోజక వర్గంలోని కృష్ణపట్నం పోర్టు, వెంకటగిరి చేనేత పరిశ్రమ, గూడూరు ప్రాంతంలోని ఖనిజ సంపద మొత్తం తిరుపతి పరిధిలోకి వెళ్ళిపోతుంది.

నెల్లూరు నగరం, గ్రామీణం, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, ప్రకాశం జిల్లాలోని కందుకూరు మాత్రం నెల్లూరుకు మిగులుతాయి. (మిగతా 11వ పేజీలో)



## సిబిఎస్ఇలో 'రత్నం' విద్యార్థుల హవా

ఈనెల 15న ప్రకటించిన సిబిఎస్ఇ ఫలితాల్లో నెల్లూరు ధనలక్ష్మీపురంలోని రత్నం సిబిఎస్ఇ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ స్కూల్‌లోని సాత్విక అనేక విద్యార్థిని 500 మార్కులకు గాను 474 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిందని అందరూ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను రత్నం విద్యాసంస్థల డైరెక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ తమ స్కూలు విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందన్నారు.

### రెయిన్‌బో జయకేతనం

సిబిఎస్ఇ 2019-20 టెన్త్ ఫలితాల్లో నెల్లూరు రూరల్ మండలంలోని కలివెల పాళెంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూల్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఈ స్కూల్‌కు చెందిన పి.అఖిల్ తేజ్‌రెడ్డి 491మార్కులతో స్కూల్, జిల్లాస్థాయిల్లో ప్రథమస్థానం సాధించాడు. ఈ పరీక్షలకు హాజరైన 90 మంది విద్యార్థులూ ఉత్తీర్ణులై 60 శాతం పైగా మార్కులు సాధించారు. వీరిలో 30 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారని పేర్కొంటూ పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ శ్రీమతి యాని గోపకుమార్, మాగుంట లేఅవుట్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీమతి అరుణ స్వయంప్రభ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి సురేఖారెడ్డి తదితరులంతా ఆ విద్యార్థులను అభినందించారు.

### జీవికె విద్యార్థుల ప్రతిభ

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ఉన్న జీవికె చిన్మయాపాఠశాల విద్యార్థులు సిబిఎస్ఇ ఫలితాల్లో తమ సత్తా చాటుకున్నారు. 31 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు వెళ్ళగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో సుగీతిక 500 మార్కులకు గాను 479 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఆర్.కుముదిని 468, ఎస్.గాయత్రి వర్మ 419 మార్కులతో ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. పాఠశాల కరెస్పాండెంట్ గీర్వాణి, ప్రిన్సిపాల్ అజిత్ ఠాగూర్ వారిని అభినందించారు.

### నూరుశాతం ఫలితాలు సాధించిన.. శ్రీసిటీ చిన్మయా విద్యార్థులు

సిబిఎస్ఇ ఫలితాల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించి శ్రీసిటీలోని చిన్మయా విద్యాలయం విద్యార్థులు అందరి ప్రశంసలు అందుకున్నారు. 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 8 మంది డిస్టింక్షన్, ఆరుగురు ప్రథమశ్రేణి, మిగిలినవారు ద్వితీయశ్రేణి సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఆ విద్యార్థులందరినీ శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కె. భువనేశ్వరి అభినందించారు.



### ప్రజలు తిరగకుండా...

## నియంత్రించ లేకపోతున్న బ్యారికేడ్ల వ్యవస్థ

### అస్తవ్యస్థంగా ఏర్పాటు చేస్తున్న అధికార యంత్రాంగం

నెల్లూరు నగరంలో కంటైన్మెంట్ జోన్ అంటూ కరోనా వ్యాధిగ్రస్తులున్న ప్రాంతాలను కట్టడి చేయడం కోసం బ్యారికేడ్ల విధానాన్ని అమలు చేసి, తమ ఇష్టానుసారంగా రోడ్లను మూసేస్తున్నారు. ఎక్కడ రోడ్లు ఎందుకు మూస్తున్నారో? అర్థం కాకుండా అయోమయ పరిస్థితుల్లో వాహనదారులు, ప్రజలు ఆలోచనలో పడే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే, బ్యారికేడ్ల వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ ఆ వ్యవస్థ వల్ల ఎక్కడా ప్రజలు ఇళ్ళల్లోనుండి బయటకు రాకుండా ఉండడం కాని, ఆ ప్రాంతాల్లో తిరగకుండా ఉండడం కాని జరగడం లేదు. కొన్నిచోట్లైతే బ్యారికేడ్లను తామే తొలగించుకుని వెళ్లిపోతున్నారు. కంటైన్మెంట్ జోన్‌లో బ్యారికేడ్ల వ్యవస్థను ఏర్పాటు చేసే పద్ధతిపై చెన్నై నగరంలో అమలు చేస్తున్న తీరును గమనించి, అదే తరహాలో మనకి కూడా చేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. అక్కడ వ్యాధిగ్రస్తుడు నివసించే అపార్ట్‌మెంట్ లేదా గృహం వరకు కట్టడి చేసి బ్యారికేడ్లను నిర్మిస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో ప్రజలు తిరగడానికి అనుమతులిస్తున్నారు. కేవలం కాంట్రాక్టర్ల లబ్ది కోసం కాకుండా, నిజమైన నియంత్రణ జరిగే విధంగా.. నెల్లూరులో కూడా ఆ పద్ధతినే అనుసరించాలని నగరవాసులు కోరుతున్నారు.

### రిపోర్టులు రావడం లేదు...

ఇక తమకు కరోనా ఉందేమో? అన్న అనుమానంతో గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రికి వెళ్లి స్వాబ్ శాంపిల్స్ ఇచ్చి టెస్ట్‌ల కోసం పంపినవాళ్ళ రిపోర్టు వచ్చేసరికే వాళ్ళకి కరోనా వచ్చి తగ్గిపోతోందని చాలామంది ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు మొన్న 12వ తేదీ ఆదివారం నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో శాంపిల్స్ ఇచ్చిన చాలామంది రిపోర్టులు ఇప్పటివరకు (గురువారం సాయంత్రం) రాలేదు. ఈ పరిస్థితి చూస్తుంటే కరోనా వస్తుందన్న భయంకన్నా, తనవల్ల తన కుటుంబసభ్యులకు ఎక్కడ సోకుతుందోనన్న అనుమానంతో చాలామంది కుమిలిపోతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డబ్బుకట్టి పలుకుబడిని ఉపయోగిస్తే మాత్రం ఇవ్వాళ టెస్టుకు పంపిస్తే, పక్కరోజే ఫలితం వస్తోంది. ఈ వింత ధోరణి చూస్తుంటే కరోనాని సైతం కమర్షియల్‌గా మార్చేశారనడానికి సందేహం అవసరం లేదు. రాబోయే కొత్త కలెక్టరన్నా ఈ విషయంలో స్పందించి, ఎప్పటి రిపోర్టులకు అప్పుడు త్వరితగతిన ఫలితాలు వచ్చేలా చూడాలని నెల్లూరీయులు కోరుకుంటున్నారు.

### అనంతపద్మనాభుని ఆలయ బాధ్యత..

# ఆ రాజ కుటుంబానిదే!



- ట్రావెన్‌కోర్ రాజులకే వారసత్వ హక్కు
- స్పష్టం చేసిన సుప్రీం తీర్పు

***కేరళలోని ఎంతో ప్రఖ్యాతమైన అనంతపద్మనాభస్వామి దేవాలయం నిర్వహణ బాధ్యత ట్రావెన్‌కోర్ రాజులదేనని, ఈ ఆలయ పరిపాలనా హక్కులు ట్రావెన్‌కోర్ రాజకుటుంబానికే చెందుతాయని, వారికి ఈ ఆలయంపై వారసత్వ హక్కు ఉందని స్పష్టం చేస్తూ ఈనెల 13న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో ఈ ఆలయ నిర్వహణపై జరుగుతున్న వివాదాలకు తెరపడినట్లయింది. చరిత్రాత్మకమైన ఈ తీర్పుతో ఆ రాజ కుటుంబం ఎంతో ఆనందం వ్యక్తం చేస్తోంది.***

కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉన్న శ్రీ అనంతపద్మనాభస్వామి క్షేత్రం ఎంతో విశిష్టమైనది.. ప్రఖ్యాతమైనది కూడా. దేశంలోని అత్యంత సంపన్నమైన దేవాలయాల్లో ఇది ప్రధానమైనది. పూర్వ కాలంలో కేరళ, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాలను ట్రావెన్‌కోర్ రాజులు పాలించేవారు. వీరి కుటుంబ దైవం..ఇలవేల్పు శ్రీ అనంతపద్మనాభస్వామి. ఈ పాలకులే 18వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని అత్యద్భుతమైన రీతిలో నిర్మించారు. ఆలయం లోపల నేలమాళిగల్లో అంతులేని సంపద ఉన్నట్లు ప్రతీతి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ ఆలయ నిర్వహణ అంతా ఈ రాజకుటుంబం వారే చూసుకునేవారు.

ట్రావెన్‌కోర్ రాజకుటుంబానికి చెందిన ఆలయ చివరి పాలకుడు బలరామవర్మ 1991లో మరణించడం, ఆయన అవివాహితుడు కావడంతో తదుపరి పాలకుడు ఎవరనే దానిపై సందిగ్ధం నెలకొనడం, ఆయన సోదరుడు మార్తాండవర్మ బాధ్యతలు చేపట్టడం జరిగాయి. ఆ తర్వాత పద్మనాభస్వామి ఆలయం నిర్వహణపై ఆరోపణలు రావడంతో వివాదం కోర్టు కెక్కింది. ఆలయ నిర్వహణను, ఆస్తులను స్వాధీనం చేసుకుని సంప్రదాయం ప్రకారం ఆలయ నిర్వహణ చేపట్టాలని కేరళ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో కేరళ రాజకుటుంబం సుప్రీంను ఆశ్రయించింది.

### సుప్రీం చరిత్రాత్మక తీర్పుతో..

### తొమ్మిదేళ్ళ వివాదాలకు తెర

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.యు లలిత్, జస్టిస్ ఇందుమల్హోత్రా ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ ఆలయానికి సంబంధించిన వ్యవహారాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి, తొమ్మిదేళ్లపాటు వాదోపవాదాల అనంతరం 218 పేజీల్లో స్పష్టమైన తీర్పు చెప్పడంతో ఇంత కాలంగా కొనసాగుతున్న వివాదాలకు తెర పడినట్లయింది.

ట్రావెన్‌కోర్ రాజకుటుంబానికి ఈ ఆలయంపై ఉన్న హక్కులు కొనసాగుతాయని, బలరామవర్మ సోదరుడు మార్తాండ వర్మకు, ఆయన వారసులకు ఈ ఆలయంపై సర్వహక్కులు ఉంటాయని సుప్రీం స్పష్టం చేసింది. చివరి పాలకుడు మరణించినంత మాత్రాన ఆ హక్కులు రద్దు కావని, ఆలయ కమిటీని ప్రభుత్వం తీసుకోజాలదని తేల్చింది.

అంతేకాదు, మరో కమిటీ ఏర్పాటయ్యే వరకు తిరువనంతపురం జిల్లా జడ్జి నేతృత్వంలోని కమిటీ ఆలయ పాలనా వ్యవహారాలు చూసుకుంటుందని, కొత్తగా ఏర్పాటయ్యే కమిటీలో సభ్యులంతా హిందువులే అయివుండాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది.

2011లో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనపెడుతూ ఈ చరిత్రాత్మకమైన దేవాలయం పరిపాలన హక్కులు ట్రావెన్‌కోర్ రాజకుటుంబానికే చెందుతాయని చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది సుప్రీంకోర్టు.

### అనంతపద్మనాభునికి..

### అనంతమైన సంపద

పద్మనాభస్వామి ఆలయంలోని నేలమాళిగల్లో వేలకోట్లుగా సంపద ఉన్నదనే విషయం 2011లో వెలుగులోకి వచ్చి దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. నేలమాళిగల్లో లక్షల కోట్ల వరకు సంపద ఉంటుందని అంచనా వేశారు కూడా.

### రాజకుటుంబంలో

### వెల్లువెత్తిన ఆనందం

అనంత పద్మనాభుని ఆలయం నిర్వహణ బాధ్యతలన్నీ ట్రావెన్ కోర్ రాజవంశానికే ఉన్నాయని తాజాగా సుప్రీం తీర్పు చెప్పడంతో రాజకుటుంబంలో ఆనందం వెల్లువెత్తింది. ఈ తీర్పు భక్తులందరి విజయమని, రాజకుటుం బానికి చెందిన పూయం తిరునాల్ గౌరీ పార్వతీ బాయి తదితర రాజకుటుంబీకులందరూ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 50 కోట్ల పాత నోట్లకు.. కొత్తవి ఇవ్వండి

### - కేంద్ర ఆర్థికమంత్రికి టిటిడి ఛైర్మెన్ వినతి



తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి సోమవారం నాడు దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిశాడు. 2016 నవంబర్ 8న భారత ప్రభుత్వం రద్దు చేసిన 500, 1000 రూపాయల నోట్లు సుమారు 50కోట్ల రూపాయలు టిటిడిలో ఉన్నాయని, భక్తులు సమర్పించిన కానుకలుగా అవి తమకు వచ్చాయని, అప్పట్లో ఉన్న పాలకమండలి సభ్యుల నిర్లక్ష్యం కారణంగా అవి టిటిడి ఖజానాలో మగ్గిపోతున్నాయని, కేంద్ర ఆర్థిక శాఖ తిరుమల తిరుపతి దేవస్థానాలను ప్రత్యేక కేటగిరి క్రింద పరిగణించి ఆ 50కోట్ల పాత నోట్లను మార్చుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరాడు. పనిలో పనిగా పోలవరంకు నిధులు మంజూరు చేయాలని, కరోనా కష్టాలకు టిటిడి కూడా బలైందని, కేంద్రం టిటిడిని కూడా ఆదుకోవాలని కోరాడు.

2016 నవంబర్ - 2019 మే వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మిత్ర పక్షంగానే కేంద్రంలో బీజేపీ ఉన్న విషయం తెలిసిందే! అయితే అప్పట్లో ఈ నోట్ల మార్పిడికి ఆ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నం చేయలేదన్నది భక్తులకు అర్థంకాని ప్రశ్న? దాదాపు మూడున్నర సంవత్సరం తర్వాత ఇప్పుడు వాటి విషయం ప్రస్తావనకు రావడం లేనిపోని అనుమానాలకు తావిచ్చి, అప్పటి పాలకమండలి నిర్వాకాన్ని ప్రశ్నింపజేసేదిగా ఉంది. కేంద్రం పెద్దమనసు చేసుకుని స్వామివారి 50కోట్లను కొత్తనోట్లతో భర్తీ చేస్తే బాగుంటుందేమో! ఓం నమో వేంకటేశాయ!

### రైతు భరోసా కేంద్రాలను

## సద్వినియోగం చేసుకోవాలి

### - జేడీ ఆనందకుమారి

జిల్లాలోని రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఆనందకుమారి కోరారు. ఈనెల 15న ఆమె నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల, సౌత్ మోపూరు, కొండ్లపూడి గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల సమస్యలు విన్నారు. ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని ఉపయోగించుకోవాలని ఆమె రైతులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం డిడి శివన్నారాయణ, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న, వీఏఏ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ బాధలు తప్పించాలి



**నగరంలోని ట్రాఫిక్ అందరికీ పెద్ద సమస్యగా తయారయ్యింది. ఈ విషయంలో పూర్తిగా మనసు పెట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఇంతవరకు ఏ అధికారి కానీ రాజకీయ నాయకుడు కానీ చొరవ చూపడం లేదు.**

**ఈ నగరానికి... ఏం కావాలి?..**

గత కొన్ని దశాబ్దాల కాలంగా నెల్లూరు నగరం అంతకంతకు పెరిగిపోతూనేవుంది. లక్షల కొద్దీ జనాభా సంఖ్యతో పాటుగా నగరం కూడా నాలుగు వైపులా విస్తరిస్తోంది. కొత్త కొత్త కాలనీలు రావడమే కాకుండా వాటితోపాటు అపార్టుమెంట్ల సంస్కృతి కూడా రోజురోజుకి అధికమవుతోంది. ఇలాంటి తరుణంలో నగరంలోని ట్రాఫిక్ అందరికీ పెద్ద సమస్యగా తయారయ్యింది. ఈ విషయంలో పూర్తిగా మనసుపెట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఇంతవరకు ఏ అధికారి కానీ రాజకీయ నాయకుడు కానీ చొరవ చూపలేదు. గత పాలకులు కొంతమేరకు ఈ ట్రాఫిక్ సమస్య విషయంలో స్పందించినా అది పత్రికా ప్రకటనలవరకే పరిమితమయ్యింది తప్ప ఆచరణకు నోచుకోలేదు.

ఇప్పుడు నగర, రూరల్ శాసనసభ్యులు అనిల్ కుమార్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి ఇద్దరూ యువకులు, ఈ నగరంపై బాగా అవగాహన కలిగిన వాళ్ళు కూడా, అనిల్‌కుమార్ మంత్రిగా కూడా వున్నాడు. వీళ్లిద్దరూ అనుకుని సమిష్టిగా కృషిచేస్తే నగర ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నగరవాసుల ఆశ. మేధావులతో ఒక కమిటీ వేసి ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత ప్రణాళికను రూపొందించి అమలు చేస్తే రాబోయే తరాలలో వీరి పేరు చిరస్థాయిగా నిలిచి పోతుందన్నది నెల్లూరీయుల ఆకాంక్ష.

### అర్జంటుగా ఆర్‌ఓబిలు కావాలి

రైల్వే లైనుకి రెండువైపులా విస్తరించిన నగరంలో, రైల్వే ట్రాక్ దాటడానికి కనీసం రెండు ఆర్‌ఓబి (రైల్ ఓవర్ బ్రిడ్జి)లు కావాలి. చిన్నపాటి వర్షమొస్తే అటు జనం ఇటు, ఇటు జనం అటు వెళ్లాలంటే పడవలు వాడాల్సిందే అని భారత దేశ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎన్నో సందర్భాలలో అన్నాడు. ముందుగా విజయమహల్ గేటు ప్రాంతంలో ఆర్‌ఓబి చాలా అవసరం. వీటి నిర్మాణం జరిగితే నగరానికి రెండు వైపులా వున్న జనం ఆనందిస్తారు.

### ఫ్లై ఓవర్లు రావాలి

ఇప్పుడు రామలింగాపురం వద్ద మంత్రి అనిల్ చొరవతో దాదాపు 42 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నట్లుగా, గ్రాండ్ ట్రంకురోడ్డుపై కూడా అయ్యప్ప గుడినుండి గాంధీ బొమ్మ సెంటర్‌లోగా రెండు ఫ్లై ఓవర్‌లు ఏర్పడాలి. ముఖ్యంగా మాగుంట సుబ్బరామ రెడ్డి విగ్రహం వద్ద దీనికి త్వరతగతిన పునాది పడాలి.

### బస్టాండ్లు మార్చాలి...

ఆత్మకూరు, ఆర్‌టిసి బస్‌స్టాండ్లను ఊరు బయటకు మార్చాలి. ఎప్పుడో 50 సంవత్సరాలక్రితం ఊరు బయట ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్టాండు ఇప్పుడు నగర నడిబొడ్డులో వుంది. నగరం పెరిగే కొద్దీ జరిగే మార్పులతోపాటు తీసుకోవలసిన కీలక నిర్ణయం బస్టాండ్ల తరలింపు. ఆత్మకూరు బస్టాండుతోపాటు ఆర్‌టిసి బస్‌స్టాండును కూడా 4లైన్ల జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ తరలింపు చేపడితే చాలావరకు టౌన్‌లో ట్రాఫిక్ అదుపులోకి వస్తుందనడంలో సందేహం అవసరం లేదు.

### దురాక్రమణలు తొలగించాలి...

దురాక్రమణలు తొలగించి రోడ్లు వెడల్పు చెయ్యాలి, పెయిడ్ పార్కింగులు పెట్టాలి, అడ్డదిడ్డంగా పార్క్ చేస్తే భారీగా ఫైన్‌లు వెయ్యాలి. ట్రాఫిక్ సిగ్నల్లు ఖచ్చితంగా పనిచేసేలా చెయ్యాలి, గంటగంటకి పెరిగిపోతున్న ఆటోల రిజిస్ట్రేషన్లు అదుపు చేసి కఠిన నిబంధనలతో కొన్ని రోడ్లలో ఆటోలను నియంత్రించి తిరగకుండా నిషేధించాలి. కొన్ని ప్రాంతాలలో వన్‌వే ట్రాఫిక్ పెట్టి, ట్రంక్ రోడ్డును మినీ బైపాస్‌ను, 4 లైన్ల జాతీయ రహదారిని కలుపుతూ కొత్త రోడ్లను నిర్మించాలి. పోలీసు శాఖ సైతం ఈ విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలి, ట్రాఫిక్ నియంత్రణలో తీసుకోవలసిన చర్యలను, ఆచరణలో సాధ్యాసాధ్యాలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తెచ్చి శాశ్వత పరిష్కారానికి మార్గం సూచించాలి. సమిష్టి కృషితోనే ఇది సాధ్యం.

ఇవన్నీ రాత్రికి రాత్రి సాధ్యం కాకపోవచ్చు, ముందుచూపుతో దీర్ఘ కాలిక ప్రణాళికతో ఒక్కొక్కటిగా అడుగు వేసుకుంటూ వెళ్తే ఏదీ అసాధ్యం కాదు. మానవ ప్రయత్నం, పట్టుదల, చిత్తశుద్ధి ఉంటే ఎంతటి అసాధ్యాన్నైనా సుసాధ్యం చెయ్యొచ్చు.

---

## కావలి 'దేశం'లో ఆధిపత్య పోరు...

# నువ్వా-నేనా అంటున్న బీద - విష్ణు



**కావలి తెలుగుదేశం పార్టీలో గత కొంత కాలంగా నివురుగప్పిన నిప్పులావున్న మాజీ శాసన సభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధనరెడ్డి, శాసనమండలి సభ్యుడు బీదా రవిచంద్ర వర్గాల మధ్య ఆధిపత్య పోరు ఇటీవల బహిర్గతమయ్యింది.**



కావలి నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయుడైన అప్పుల కళ్యాణచక్రవర్తి ఉరఫ్ బాబీపై జిల్లా తెలుగుదేశం పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి పేరుతో బాబీని పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ ప్రకటన విడుదల చేశారు. కావలిలో నివురు గప్పివున్న నిప్పుపై ఈ ప్రకటన ఆజ్యం పోసినట్లైంది. రెండు కుంపట్లు రాజుకున్నాయి. ఇన్‌ఛార్జి విష్ణువర్ధనరెడ్డికి తెలియపరచకుండా సస్పెండ్ వేటు ఏమిటని ఒక వర్గం వాదిస్తుండగా... బీదా రవి చంద్రకు అనుకూలంగా వుండే వర్గం పార్టీలో క్రమశిక్షణ తప్పిన వాళ్లకు ఇంతే జరుగుతుందన్న వాదన వినిపిస్తున్నారు. ఈ వివాదం ఇంతటితో సమసిపోయేటట్లు లేదు. చిలికి చిలికి గాలివానగా మారే అవకాశం కనిపిస్తోంది. ఈ సస్పెన్షన్ తెలిసిన తర్వాత విష్ణువర్ధనరెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. తనతో సన్నిహితంగా వున్న కళ్యాణచక్రవర్తి విషయం తెలియగానే విష్ణువర్ధనరెడ్డి రాష్ట్ర కార్యాలయానికి కాల్ చేసి, కావలికి ఇన్‌ఛార్జి నేనా? మరెవరినైనా పెట్టారా?? అని ప్రశ్నించినట్లు సమాచారం. కావలికి మీరే ఇన్‌ఛార్జి అని, సస్పెండ్ విషయం తమదాకా రాలేదని, ఈ విషయంపై ఫిర్యాదు చేయమని రాష్ట్ర కార్యాలయం విష్ణువర్ధన్‌రెడ్డిని కోరినట్లుకూడా వినపడుతోంది.

కళ్యాణచక్రవర్తిని ఎందుకు సస్పెండ్ చేశారని బీదా వర్గీయుల్ని అడిగితే, ఈమధ్య కళ్యాణచక్రవర్తి పార్టీలోని కొంతమంది మీద అసభ్యంగా పోస్టింగ్స్ పెట్టాడని, అందువలనే సస్పెండ్ చేసి ఉండొచ్చని చెబుతున్నారట.

వాళ్ళ అభియోగంపై కళ్యాణచక్రవర్తిని వివరణ అడిగితే – అంతా ట్రాష్... అని కొట్టిపారేస్తున్నాడు. ఆధారాలుంటే రుజువు చేయమని సవాలు కూడా విసురుతున్నాడంట.

ఈ తంతంతా పక్కన పెడితే... కాటంరెడ్డి విష్ణు వర్ధన్‌రెడ్డి, బీదా రవిచంద్రల మధ్య జరుగుతున్న ఆధిపత్యపు పోరులో భాగమే ఈ తతంగం అన్నట్లు భావించాల్సివస్తోంది. గత కొద్దిమాసాలుగా కావలిలో ఇరు వర్గాలు ఎడమొఖం పెడ మొఖంగానే వున్నాయి. ఎన్టీఆర్ జయంతితో పాటు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రల అరెస్ట్‌పై జరిగిన నిరసన కార్యక్రమాలు రెండు వర్గాలు వేరువేరుగా చేశాయి. ఆ పార్టీలో రెండు వర్గాలు వున్న విషయం అప్పటినుండి బహిర్గతమయింది. కావలి నియోజక వర్గంలో గత సార్వత్రిక ఎన్నికల వరకు బీదా రవిచంద్ర పెత్తనమే సాగింది. పార్టీ ఎమ్మెల్యేగా బీదా మస్తాన్‌రావు ఉన్నా, తమ్ముడు రవిచంద్ర చేతిలోనే పగ్గాలుండేవి. నియోజకవర్గంలో ఉన్న దేశం నాయకులతో, కార్యకర్తలతో రవిచంద్ర సత్సంబంధాలు ఏర్పరచుకున్నాడు. ఇప్పటికీ ఆ సంబంధాలు కొనసాగిస్తూనే వున్నాడు.

విష్ణువర్ధనరెడ్డి విషయానికొస్తే.. ఆయన మొదటినుండి కాంగ్రెస్ వాది. ఆ తర్వాత వైయస్సార్సీపీలో చేరాడు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైయస్సార్సీపీ అభ్యర్థిత్వం లభించకపోవడంతో ఆయన తెలుగుదేశాన్ని ఆశ్రయించాడు. ఆయనకు తెలుగుదేశంతో అనుబంధం మొన్నటి ఎన్నికల నుండే. ఇప్పుడు దేశం ఇన్‌ఛార్జి ఆయనే అయినా నియోజకవర్గంలోని తెలుగుదేశం క్యాడర్‌తో ఇంకా పూర్తిస్థాయి సంబంధాలు రాకపోయినప్పటికీ పార్టీ శ్రేణులు మాత్రం విష్ణువర్ధన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నారు. అధికారంలో లేకపోయినా నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ అందరితో సత్సంబంధాలు కలిగి వుంటాడన్న పేరు విష్ణుకి వుంది.

అయితే.. అధికారం పోయి, మొదలే పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటే.. ఇప్పుడీ ఆధిపత్య పోరేమిటని కావలి తెలుగు తమ్ముళ్లు మరోవైపు ఆందోళన చెందుతున్నారు.

---

## కావలిలో ...

# బాధ్యతలు చేపట్టిన చక్రధర్‌బాబు



జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమితుడైన చక్రధర్‌బాబు గురువారం (జూలై16) సాయంత్రం 6 గంటల 10నిముషాలకు కావలి ఆర్డీవో కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టాడు. విజయవాడ నుండి నెల్లూరుకు వస్తూ మార్గమధ్యంలో కావలిలో ఆగి ముహూర్తబలం బాగుండడంతో బాధ్యతలు చేపట్టాడు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా వున్న జాయింట్ కలెక్టర్‌ను కావలికే పిలిపించుకుని అక్కడే ఆయన నుండి బాధ్యతలు స్వీకరించాడు. అనంతరం జిల్లాలో కరోనా పరిస్థితి ఏమిటి? అని అధికారులను ప్రశ్నించి, వారు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశాడు. కావలి పట్టణంలో ప్రయాణించిన కలెక్టర్, కావలి మున్సిపల్ కమిషనర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఇది పల్లెటూరా? పట్టణమా? అని ప్రశ్నిస్తూ... ఎక్కడా పారిశుద్ధ్యం గాని, శానిటైజేషన్ గాని నామమాత్రం కూడా కనిపించడం లేదే అంటూ ఆగ్రహించాడు. శుభం! అందరూ అనుకున్నట్లుగానే తనదైన పరిపాలనా మార్కును చక్రధర్‌బాబు రావడంతోటే మొదలుపెట్టాడు. ఇదే స్పీడుతో జిల్లాలోని మిగతా కార్పొరేషన్‌లతో పాటు నెల్లూరు కార్పొరేషన్‌లో సైతం జరుగుతున్న అరాచకాలను అడ్డుకుంటాడని ఆశిద్దాం! వెల్‌కమ్ టు చక్రధర్‌బాబు!

# స్టేషన్ బెయిల్ ఇకపై రద్దు

స్ట్రీట్ రౌడీ నుండి స్టేట్ పొలిటీషియన్ వరకు తమ ఇష్టానుసారం నేరాలు చేయడం, రౌడీయిజం, దౌర్జన్యాల వంటి అఘాయిత్యాలకు పాల్పడడం, ప్రత్యర్థులు కేసులు పెడితే అరెస్ట్ అయ్యి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చి, కాలర్ ఎగరవేయడం పెద్ద ఫ్యాషనైపోయింది. ఇలాంటి అకృత్యాలకు, ఆనవాయితీకి సుప్రీం కోర్టు చెక్ పెట్టింది. నేరం ఎంత చిన్నదయినా, నేరస్తుడు ఎంతటివాడైనా ఖచ్చితంగా కోర్టు బెయిల్ తీసుకోవాల్సిందే అని శాసించింది. ఇకపై స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి లేదని దేశమంతా ఒకే తరహా చట్టాన్ని తీసుకొచ్చింది. చట్టాన్ని తన చుట్టంగా చేసుకుని పోలీస్ స్టేషన్లను తమ అత్తవారిళ్ళలాగా భావించి, అలా వెళ్లి ఇలా వస్తున్న నేరగాళ్ళకు ఇకపై చెక్ పెట్టినట్లే!

## 'ప్రభా'తం

# మన పరిశ్రమలు భద్రమేనా?

**మన పరిశ్రమలు భద్రమేనా? అన్న ప్రశ్నకు సమాధానం కరువే! పరిశ్రమల నిర్వహణలో లోపాలు, భద్రత పట్ల అలక్ష్యం వల్ల పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వందలు, వేలాదిమందికి ఉపాధినిచ్చేవి కర్మాగారాలు కనుక, వాటి భద్రత ఎంతో ముఖ్యం. భద్రత లేకుండా అభద్రతగా ఉంటే ఎంతైనా ప్రమాదం. అన్ని విభాగాల్లో లాగే ప్రతి పరిశ్రమలోనూ ఒక ఖచ్చితమైన 'భద్రతా విభాగాన్ని' పెట్టుకుని, పర్యవేక్షణ లోపం లేకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం.**

'మన పరిశ్రమలు భద్రంగానే ఉన్నాయా?'..అన్నది ఇప్పుడు ఒక పెద్ద ప్రశ్నగా మారింది. పరిశ్రమలు భద్రంగా ఉంటే, పరిశ్రమల్లో పనిచేసేవారు భద్రంగా ఉంటారు. వారు భద్రంగా ఉంటే వారి పిల్లాపాపా అందరూ క్షేమంగా ఉంటారు. కనుక పరిశ్రమల భద్రత ఎంతో ముఖ్యం. ప్రతి పరిశ్రమలోనూ పెద్ద సంఖ్యలోనే కార్మికులు పనిచేస్తుంటారు. మరెంతో మంది సిబ్బంది ఉంటారు. వీరందరికీ భద్రతకు సంబంధించిన అవగాహన కల్పించడంతో పాటు, పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడడం ఆయా పరిశ్రమల యజమానుల బాధ్యత. ముఖ్యంగా రసాయనాలకు సంబంధించిన పరిశ్రమల్లో ఈ భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టంగా ఉండాలి. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా క్షణాల్లోనే అంతా గల్లంతైపోతుంది. చివరికి చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం ఉండదు.

రాష్ట్రంలో ఇటీవలికాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతోమంది బాధితులవుతూనే ఉన్నారు. తాజాగా విశాఖపట్టణంలోని రాంకీ ఫార్మాసిటీలో ఉన్న విశాఖ సాల్వెంట్‌లో పేలుడు జరిగింది. ఈ దుర్ఘటనలో జూనియర్ ఆపరేటర్ ఒకరు మరణించారు. శుద్ధిచేసిన సాల్వెంట్ నాణ్యతను పరిశీలించడానికి వెళ్ళిన ఆయన్ను మంటలు చుట్టుముట్టడంతో గుర్తుపట్టలేని విధంగా కాలిపోయి చనిపోయాడని చెప్తున్నారు. ఈ ఘటన లోనే మరో ఉద్యోగి కూడా మంటలపాలై తీవ్ర గాయాలపాలయ్యాడు. వ్యాక్యూం, ఉష్ణోగ్రతలు పెరగడంతో రియాక్టర్ పేలిపోయిందనేది ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోంది కూడా.

ఇటీవలికాలంలో మన రాష్ట్రంలోని ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ, ఎస్పీవై ఆగ్రో, సాయినార్ లైఫ్ సైన్సెస్ ఇప్పుడు తాజాగా విశాఖ సాల్వెంట్స్ పరిశ్రమ.. ఇలా పరిశ్రమలు వరుస ప్రమాదాల బారిన పడుతుండడం ఎంతైనా విచారకరం.. ఆందోళనకరం కూడా.

సాధారణంగా పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా మానవతప్పిదం వల్లే జరుగుతుండడం అందరికీ తెలిసిందే. భద్రతపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం, ప్రమాదం జరిగే దాకా భద్రతా చర్యలను ఏమాత్రం పట్టించుకోకపోవడం తరచూ జరుగుతూనే ఉంది. అందువల్లనే మన పరిశ్రమల్లో భద్రత బాగా కొరవడుతోంది. తీరా.. జరగరాని ఘోరం జరిగి పోయాక ఇచ్చే పరిహారాలు ఆయా కుటుంబాల మనోవ్యధను ఏమాత్రం తీర్చగలవు?..అందుకే ముందు జాగ్రత్తలే..ఈ ప్రమాదాల నివారణకు దివ్యౌషధం అని పరిశ్రమల వారు ఇకనైనా గుర్తించాలి.

ప్రతినిత్యం భద్రతా చర్యలను సమీక్షించుకోవడం కూడా పరిశ్రమల వారి దినచర్యలో ఒక భాగం కావాలి. ఎవరో ఒకరికి ఆ బాధ్యతను అప్పగిస్తే సరిపోతుందని నిర్లక్ష్యంగా చేతులు దులుపుకుంటే, ఆ తర్వాత జరిగే దుష్పరిణామాలకు ఎవరు బాధ్యులు?..ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయమిది. వాస్తవానికి పరిశ్రమల నిర్వహణకు ఎన్నో నియమ నిబంధనలున్నాయి. భద్రత పాటించకుంటే చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ అధికారయంత్రాంగం..చట్టాలు ఎటూ ఉండనే ఉన్నాయి. అయినా అనేక పరిశ్రమల్లో భద్రత పట్ల ఇంకా చిన్నచూపే ఉండడం ఆందోళన కలిగించే అంశం. భద్రతకు సంబంధించి ఎవరూ కఠినంగా ఉండకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. చట్ట ప్రకారం వెయ్యి మందికిపైగా సిబ్బంది పనిచేసే పరిశ్రమల్లో భద్రత అధికారులను తప్పనిసరిగా నియమించాలి. ఒకవేళ అంతకంటే తక్కువ మంది ఉన్నప్పటికీ ప్రమాదానికి అవకాశం ఉండే పరిశ్రమల్లో భద్రతాధికారుల నియామకం అవసరం. అనేక సంస్థలు ఇలాంటి భద్రతా చర్యలను పాటించకపోవడం సర్వసాధారణమైపోయింది. దీంతో ప్రమాదాలు జరిగిపోతూనే వున్నాయి.

పరిశ్రమల్లో రక్షణ చర్యలు ఎలా ఉన్నాయో ప్రతి నిత్యం యాజమాన్యాలు పరిశీలించుకోవాలి. ప్రతి పరిశ్రమలోనూ భద్రతను పరిరక్షించే అధికారులు, సిబ్బందితో పాటు ఆయా పరిశ్రమల ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. ఏమీ పట్టించుకోకుండా.. 'మన పరిశ్రమలు బాగానే ఉన్నాయిలే'.. అని అలక్ష్యంగా ఉంటే, ఎక్కడో ఒక చోట జరిగే పొరపాటో లేదా గ్రహపాటో ఎందరి ప్రాణాలకో ముప్పు తీసుకువచ్చే ప్రమాదం ఎంతైనా ఉంటుంది. పరిశ్రమల్లో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించినా యాజమాన్యాలపై కఠిన చర్యలు లేకపోవడం వల్ల కూడా నిర్లక్ష్యధోరణి పెరిగి భద్రత మరింత కుంటుపడుతోందనే అభిప్రాయాలూ లేకపోలేదు.

ఇటీవల ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటనపై విచారణ జరిపిన ఒక ఉన్నతస్థాయి కమిటీ పరిశ్రమల భద్రతకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. ప్రతిఏటా భద్రత, పర్యావరణ విషయాల పట్ల ఆడిట్‌లు తప్పని సరిగా ఉండాలని, లోపాలుంటే సరిదిద్దుకోవాలని, ప్రమాదకర రసాయనాలను నిర్వహించే ప్రతి పరి శ్రమకు నిర్ణీత సాంకేతిక అర్హతలు అనుభవం కలిగిన వ్యక్తే సేఫ్టీ అధికారిగా ఉండాలని, ప్రతి షిఫ్టులోనూ ఆ అధికారి అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి పరిశ్రమ సంసిద్ధంగా ఉండేలా ఇలాంటి ముందు జాగ్రత్తలన్నీ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించింది. అంతే కాదు, ప్రమాదకర రసాయన పరిశ్రమలను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని కూడా పేర్కొంది. ఇలా.. నియమనిబంధనలు ఎన్నున్నా ఆమలులోకి వచ్చేసరికే అలక్ష్యం వచ్చేస్తుంటుంది. నియమ నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తున్నవారెందరు?..అనే ప్రశ్నకు సరైన సమాధానం దొరకదు. ఒక్కమాటలో చెప్పాలంటే నిర్లక్ష్యంగా ఉండడం వల్లనే ప్రమాదాలు పెరుగుతున్నాయి.

ఏదేమైనా పరిశ్రమలు..వందలు, వేలాదిమందికి ఉపాధినిచ్చే కర్మాగారాలు కనుక, వాటి భద్రత ఎంతో ముఖ్యం. భద్రత లేకుండా అభద్రతగా ఉంటే ఎంతైనా ప్రమాదం. అన్ని విభాగాల్లో లాగే ప్రతి పరిశ్రమలోనూ ఒక ఖచ్చితమైన 'భద్రతా విభాగాన్ని' పెట్టుకుని, పర్యవేక్షణ లోపం లేకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం. అటు పరిశ్రమల యాజమాన్యాలు, ఇటు కార్మికులు, అధికారులు, ఉద్యోగులు సిబ్బంది.. అందరూ భద్రత పట్ల సరైన అవగాహనతో ఉండడమే అందరికీ శ్రీరామరక్ష!..




## విద్యుత్ శాఖలో బదిలీలు

ఎస్పీడిసిఎల్ నెల్లూరుజిల్లా సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. సూళ్ళూరుపేటలో ఏడిఇగా ఉన్న విజయకుమార్‌రెడ్డిని నెల్లూరు టిఆర్‌ఇ ఏడిఇగా బదిలీచేస్తూ విద్యుత్‌శాఖ సిఎండి హరనాథ్‌రావు ఈనెల 12న ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా అనంతపురంజిల్లా కల్యాణదుర్గం ఏడిఇ ఖాదర్‌బాషాను సూళ్ళూరుపేట ఏడిఇగా నియమించారు. నార్త్‌రాజుపాళెం ఏడిఇగా పరంజ్యోతిని, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఏడిఇగా ఉన్న శ్రీనివాసులును బుచ్చిరెడ్డిపాళెంకు, ఈస్ట్-1 ఏఇగా పనిచేస్తున్న రమేష్‌బాబును ఇనమడుగుకు, అక్కడ పనిచేస్తున్న ఏఇ భాస్కర్ రావును ఇరువూరు ఏఇగా నియమించారు. నెల్లూరు, టౌన్‌హాలు ప్రాంతంలో ఏఇగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును తెలంగాణకు కేటాయించారు.

## సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తిచేయాలి

మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో మంచినీళ్లకు, సాగునీళ్లకు ఇబ్బంది లేకుండా వెంటనే సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులను కూడా సత్వరం పూర్తిచేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకుడు దుద్దుకూరు రమేష్ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మన దేవాలయాలు చాలా బాగుంది

'లాయర్'లో మీరు నూతనంగా ప్రారంభించిన 'మన దేవాలయాలు' శీర్షిక ఎంతో బాగుంది! మన జిల్లాలోని ప్రముఖ ప్రాచీన దేవాలయాలు, వాటి చరిత్ర, ప్రాశస్త్యం తెలుసుకోవడం చాలా ఆసక్తికరంగా వుంది. వారం వారం ఒక్కొక్క దేవాలయాన్ని దర్శింపచేస్తున్నారు. ఇలాంటి మంచి శీర్షికను మీరు ప్రవేశపెట్టినందులకు నా అభినందనలు.

డాక్టర్ ఎం. పెంచలరెడ్డి, నెల్లూరు.

## పరిశుభ్రత పాటించాలి

నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో పరిశుభ్రత కనిపించడమే లేదు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగుదిబ్బలే. ముఖ్యంగా దర్గామిట్ట, ఏకె నగర్, పొదలకూరురోడ్డు తదితర ప్రాంతాలు దుర్గంధంలో కూరుకుపోయి ఉన్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి.

సుబ్బరాయుడు, నెల్లూరు.

## సెల్ఫీ వీడియోలతో ఆత్మహత్యలు హృదయ విదారకం

ఇటీవల ఆత్మహత్యలలో కొత్త ట్రెండ్ పుట్టుకొచ్చింది. గతంలో ఆత్మహత్యలు చేసుకొనేవారు సూసైడ్ నోట్ రాసి పెట్టి ప్రాణాలు తీసుకునేవారు, ఇప్పుడు ఏకంగా సెల్ఫీ వీడియోలు తీసుకుని ఆత్మహత్యలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. ఇది చాలా బాధాకరం, హృదయ విదారకం. ఆత్మహత్య మహా పాపం, భగవంతుడు ఇచ్చిన ప్రాణాన్ని తీసుకునే హక్కు ఎవ్వరికీ లేదు. తమ ఇష్టానుసారం ప్రాణాలని తీసుకోవడమే కాకుండా ఇలా సెల్ఫీ వీడియోలు పెట్టినందువల్ల అవి మరికొంతమందిని ప్రేరేపించేవిగా ఉంటున్నాయి. ఇలాంటి వీడియోలు అసలు బయటికి రాకుండా చూడాలి, సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి వీడియోలను ఎవ్వరూ పోస్ట్ చేయకుండా పోలీసు శాఖ చర్యలు చేపడితే బాగుంటుంది. కరోనా వ్యాధి భారినపడి ఆసుపత్రిలో ఇటీవల తెలంగాణాలో ఒకరు, ప్రియుడు తన ప్రేమను నిరాకరించాడని నెల్లూరులో ఒక యువతి, తన కుమార్తె తనకు ఇష్టంలేని పెళ్లి చేసుకుందని ఆవేదన చెందుతూ ఒక తండ్రి ఇలా అనేక ఆత్మహత్యల సెల్ఫీ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ వీడియోలు చూసినప్పుడు వారి కుటుంబ సభ్యులు ఎంతటి మనోవ్యధకు గురవుతారో మనం ఒక్కసారి ఆలోచించుకోవాలి. దయచేసి ఈ సెల్ఫీ వీడియోలను అద్దుకోండి. ఇలాంటివి ఎవ్వరూ చూడకండి, మరొకరికి ఫార్వర్డ్ చెయ్యకండి.

పుట్టా హరిత, గూడూరు.

## తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదు

ఇటీవల ఏ రాజకీయనాయకుడు తిరుమల వెళ్లినా, స్వామివారిని దర్శించుకుని వచ్చిన అనంతరం బయట విలేకరులతో రాజకీయాలు ముచ్చటిస్తున్నారు. ఈ సాంప్రదాయం మంచిది కాదు. పార్టీ ఏదైనా నాయకుడు ఎంతటి వాడైనా ఈ సంస్కృతికి స్వస్తి పలకాలి. అతి పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రంలో వీళ్ళు రాజకీయాలు మాట్లాడి పవిత్రతకు భంగం కలిగిస్తున్నారు. ప్రస్తుత టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి గారు వెంటనే స్పందించి ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకుని రాజకీయ ప్రసంగాలు, విమర్శలు తిరుమలలో నిషేధిస్తే బాగుంటుంది. కావాలంటే అలిపిరి వద్ద వీరికోసం ఒక మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ వారికిష్టమైనవి మాట్లాడుకోమని చెప్పండి. 'నమో వెంకటేశాయ' నామస్మరణతో మార్మోగాల్సిన తిరుమలకొండలు ఇలా రాజకీయ ఉపన్యాసాలకు వేదిక అవుతుండడం చాలా బాధాకరం.

జి.వి.సుబ్బయ్య, పిడుగురాళ్ల.

## స్కూళ్లలో ఫీజులు బాగానే గుంజుతున్నారు

అయ్యా... గతవారం మన 'లాయర్' పేపర్‌లో 'బడులు మూత – ఫీజుల కోత' అంటూ మంచి వార్తే రాశారు. మీరు పేర్కొన్నట్లుగా ఇవి కరోనా కష్టాలే, కానీ ఇక్కడ ముఖ్య విషయం మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తేవాలనుకుంటున్నాను, మీరు రాసినట్లుగా ఫీజులు వసూళ్ల చేయడంలో స్కూల్ యాజమాన్యాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయనడంలో వాస్తవం లేదు. అనేక కార్పొరేట్ స్కూళ్లలో ముందుగా డబ్బు కడితే తప్ప లాగ్‌ఇన్ ఐడి పాస్‌వర్డ్ ఇవ్వడంలేదు. పేరుకు పేరెంట్స్‌ని విమర్శిస్తున్నారు, తప్ప ఇప్పటికీ పిల్లల భవిష్యత్తు కార్పొరేట్ బళ్ల యాజమాన్యాల చేతిలోనే వుందన్నది కాదనలేని నిజం. ఎక్కడో కొంతమంది అయ్యవార్లు, కొన్ని స్కూళ్ళు ఇబ్బంది పడుతుండవచ్చు, అంత మాత్రాన విద్యా వ్యవస్థ మొత్తం అవస్థలో లేదన్నది నా అభిప్రాయం. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇలాంటి తరుణంలో ఫీజుల వసూళ్ల విషయంలో ఒక స్లాబ్ పద్ధతిని ప్రవేశపెట్టి కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని కోరుతున్నాను.

కె.భద్రినారాయణ, నవాబుపేట.

# రాష్ట్రం విడిపోయిందని..
# ఇప్పుడనిపిస్తోంది

**● ఆంధ్రాలోకి (వీసా ) ఇ-పాస్ తీసుకుని రావాలంటే ప్రతి తెలుగు గుండె రోదిస్తోంది**

**తెలంగాణలోకి రావాలంటే వీసా తీసుకోవాలా...? అని దివంగత మహానేత వై.యస్ అన్న మాటలు ఇప్పుడు గుర్తొస్తున్నాయి. అది తారుమారై ఆ పరిస్థితి ఆంధ్రాకి రావడం బాధాకరం.**



*ఆంధ్రప్రదేశ్, 2014 వరకు ఇది ఉమ్మడి రాష్ట్రం. దక్షిణ భారతదేశంలోని పెద్ద రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఇప్పుడు అది విడిపోయింది, విడిపోయి ఆరేళ్ళయింది. పార్లమెంటు తలుపులు మూసేసి రాష్ట్రవిభజన తంతును సోనియా నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ మమ అనిపించినప్పుడు కూడా కలుగని ఆందోళన ఇప్పుడు కలుగుతోంది.*

బీజేపీ, తెలుగుదేశం సహా అన్ని రాజకీయ పార్టీలు, అన్ని పార్టీల నాయకులు తమ స్వార్ధం కోసం అన్నదమ్ముళ్ల లాంటి తెలుగు సోదరులను విడగొట్టినప్పుడు కూడా కలగని ఆవేదన ఇప్పుడు కలుగుతోంది. అంత పెద్ద ఉమ్మడిరాష్ట్రం రెండు ముక్కలై, చిన్న రాష్ట్రాలుగా ఏర్పడుతున్నాయని విన్నప్పుడుకూడా రాని దుఃఖం ఇప్పుడు వస్తోంది.

ఉమ్మడి రాజధానిగా హైద్రాబాదు 10 సంవత్సరాలు ఉంటుందని కేంద్రం ప్రకటించినప్పటికీ, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు, కేసిఆర్ దెబ్బకు భయపడి ఆంధ్రకు పారిపోయి వచ్చి అమరావతిని రాజధానిగా ప్రకటించి వందల కోట్ల ప్రజాధనం తగలబెట్టినప్పుడు కూడా కలగని బాధ ఇప్పుడు కలుగుతోంది. రాష్ట్ర సరిహద్దులు నిర్ణయించి భద్రాద్రి రామయ్యను తెలంగాణకు ఇస్తున్నాం, శ్రీశైలం మల్లన్నను ఆంధ్రులకు వదిలే స్తున్నాం.. అని దేవుళ్లను పంచినప్పుడు కూడా కలగని మనస్తాపం ఇప్పుడు కలుగుతోంది.

అటు తెలంగాణలోనూ ఇటు నవ్యాంధ్రలోనూ ప్రతి తెలుగు వాడి గుండె చెరువై రోదిస్తోంది...

**...అందుకు కారణం 'కరోనా'.**

మనభాష ఒక్కటే, మన సంప్రదాయాలు ఒక్కటే, మన కట్టు బొట్టు ఒక్కటే, మన సంస్కృతీ ఒక్కటే, మనమంతా అన్నదమ్ములం, అక్క చెల్లెళ్ళం అని చెప్పుకుంటున్న మనం ఇప్పుడు ఒక తెలుగు రాష్ట్రం నుండి మరో తెలుగు రాష్ట్రానికి రావాలంటే ఇ-పాస్ తీసుకుంటున్నాం. మొన్నటి వరకు కలిసి మెలిసి జీవించిన మనం, ఇంకా ఉమ్మడి రాజధాని హైదరాబాదే అనుకుంటున్న మనం, అక్కడినుండి ఇక్కడకి రావాలంటే అనుమతులు తీసుకుంటున్నాం. ఇది అత్యంత బాధాకర పరిస్థితి, రాష్ట్రం విడిపోయిందన్న స్పృహే లేని ప్రతి తెలుగువాడికీ ముఖ్యంగా ఆంధ్రాలో జీవించే ప్రతి ఆంధ్రుడికీ ఇది ఎంతో బాధాకర పరిణామం.

పాత ఉమ్మడి రాష్ట్రం నుండి మన నవ్యాంధ్రలోకి ప్రవేశించడం కోసం మనం ఆన్‌లైన్‌లో అప్లై చేసి ఇ-పాస్ పొందడం ఒక ప్రహసనమైతే... సరిహద్దుల్లో పోలీసుల ముందు హాజరై ఏదో నేరం చేసి రాష్ట్రంలో ప్రవేశించేవాడిలా మన గుర్తింపును మనం చూపించుకుని... మన ఆరోగ్యాన్ని పరీక్షించుకుని వాళ్ళు ఒకే అంటేనే రాష్ట్రంలోకి ప్రవేశించే దౌర్భాగ్య పరిస్థితి చూస్తుంటే... హత విధీ... తెలుగోడికి ఇంతటి దుర్గతి పట్టించావా కరోనా... అని అనక తప్పదేమో!

## గుర్తుకొస్తున్న వై.యస్ మాటలు...

ప్రస్తుతం ఆంధ్రాలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి అప్పట్లో అసెంబ్లీలో అన్న మాటలు గుర్తొస్తున్నాయి. తెలంగాణకు రావాలంటే ఆంధ్రా ప్రజలు వీసా తీసుకోవాలా...? అని కేసిఆర్‌ని ప్రశ్నించాడు. ఇప్పుడు ఆ కేసిఆర్ ప్రభుత్వం ఆంధ్రా ప్రజలను ఆపడంలేదు, కానీ ఆంధ్రా అధికారులు మాత్రం రాష్ట్రంలోకి వచ్చేవాళ్ళకి చుక్కలు చూపిస్తున్నారు.

కరోనాతో కలిసి జీవిద్దాం అని మొట్టమొదటిసారిగా పిలుపునిచ్చింది ఆంధ్రా సిఎం జగన్మోహన్‌రెడ్డే. కరోనాను సమర్ధనీయంగా ఎదుర్కొంటున్న రాష్ట్రం ఆంధ్రానే, కరోనా భాదితులకు ఆసరాగా నిలిచి 'నేనున్నాను' అన్న భరోసా ఇస్తోంది జగనే, ఇతర రాష్ట్రాలు సైతం ఆంధ్రావైపు చూసే విధంగా కరోనాని అన్ని విధాలా కట్టడి చేస్తోంది ఒక్క ఆంధ్రానే.

ఇలాంటి పరిస్థితులలో మొన్నటి వరకు మనతో కలిసివున్న మన పొరుగు రాష్ట్రం నుండి మన రాష్ట్రంలోకి రావాలంటే వీసా(ఇ పాస్) తీసుకోవాలనే నిబంధన అధికారులు విధించడం శోచనీయం. వేరే ఇతర ఏ రాష్ట్రానికైనా ఈ నిబంధన విధిస్తే అర్ధముంది, అలాకాకుండా గత కొన్ని దశాబ్దాలుగా ఆత్మీయ అనుబంధంతో కూడిన కుటుంబ బాంధవ్యాలు కలిగిన ఆంధ్రా తెలంగాణ మధ్య ఈ షరతులు పెట్టడం విడ్డూరం. ముఖ్యమంత్రిని సైతం పక్కదోవ పట్టించి అధికారులే ఇలాంటి చెత్త నిబంధనలు విధించారని వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులే కాకుండా కొంత మంది ఉన్నత స్థాయి అధికారులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రా, తెలంగాణవాసుల మధ్య వున్న సత్సంబంధాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఈ ఇ-పాస్ విధానాన్ని రద్దు చేయాలని కూడా వారు కోరుతున్నారు.

# సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్‌కు కొత్త కమిటీ

**గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే కిలివేటి.. అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి**

సూళ్ళూరుపేట వ్యవసాయ మార్కెట్‌కు కొత్త కమిటీని నియమిస్తూ ఈనెల 13న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షునిగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, అధ్యక్షుడిగా మారంరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నల్లారెడ్డి సురేంద్ర రెడ్డి నియమితులయ్యారు. ఉగ్గుమూడి కామేశ్వరి, శిరసనంబేటి రాజేశ్వరి, జె.సుధాకర్, పాముల పురుషోత్తం, ముమ్మడి గంగయ్య, చిలకా స్వాతి, బట్టా చెంచులక్ష్మి, పాల మహేశ్వర్, తుమ్మా సుభాషిణి, తుపాకుల చంద్రమ్మ, వి.బాలసత్యనారాయణ, ఏ.బద్రినారాయణ, ఆట్రంబాకం అయ్యపరెడ్డిలతో పాటు నెలబల్లి పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వూరు బాలచంద్రారెడ్డి, సహాయ మార్కెటింగ్ అధికారిణి, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు, కొండూరు పంచాయతీ ప్రత్యేకాధికారిని సభ్యులుగా నియమించారు.

## కరోనా నియంత్రణలో ప్రభుత్వం విఫలమైంది

కరోనా వ్యాధిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, క్వారంటైన్‌లలో కరోనా బాధితులకు సరైన సౌకర్యాలు కానీ, మంచి ఆహారం కానీ అందించలేకపోతోందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దామా అంకయ్య విమర్శించారు. ఈనెల 13న ఆయన కావలి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైద్యసిబ్బందికి పిపిఇ కిట్‌లు కూడా సక్రమంగా లేవని, వారికి సరైన రక్షణ ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు దేగా సత్యం, కొండయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



# బొప్పాయికీ..
# తప్పని 'కరోనా' దెబ్బ

- గిట్టుబాటు ధర లేక రైతుల లబోదిబో
- పండ్లను తోటల్లోనే వదిలేస్తున్న వైనం




***ఈసారి జిల్లాలో బొప్పాయి పంట సాగు బాగానే సాగింది. బొప్పాయి కాయలు, పండ్లు కూడా విరివిగా పండాయి. అయితే, కరోనా దెబ్బతో బొప్పాయి రైతులు అష్టకష్టాల్లో పడ్డారు. ఈ సీజన్‌లో మంచి లాభాలు వస్తాయనుకుని ఆశపడుతూ తోటలు సాగుచేసుకున్న రైతులకు అకస్మాత్తుగా వచ్చిపడిన కరోనా వ్యాధి ప్రభావంతో నష్టాల సుడిలో చిక్కుకుపోయారు. ఆరుగాలం తోటలను కష్టపడి సాగు చేసుకున్నా.. ఆ కష్టం చివరికి చేతికందకపోవడంతో రైతులకు కన్నీరే మిగులుతోంది.***

జిల్లాలోని తోటల రైతాంగానికి కూడా ప్రతి ఏడాదీ ఏదోఒక కష్టం వస్తూనే ఉంది. ఈసారి సీజన్‌లో తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, పంట బాగా పండితే మంచి లాభాలు వచ్చి చేసిన అప్పులన్నీ తీరిపోతాయని కష్టపడి బొప్పాయి పంట సాగుచేసుకున్న రైతులకు మాత్రం నిరాశే మిగిలింది. ఉన్నట్లుండి వచ్చిన కరోనా మహమ్మారి వ్యాధి ప్రభావం, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో ఎగుమతులు పూర్తిస్థాయిలో తగ్గిపోవడంతో, ధర కోల్పోయి రైతులు నష్టాల్లో చిక్కుకుపోయారు. బొప్పాయి ఎంతో ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లైనప్పటికీ రవాణా సౌకర్యాలు లేకపోవడం, మార్కెట్లు మూతపడి ఉండడం, దుకాణాల్లో బొప్పాయిని కొనేవారు అంతగా లేకపోవడం, ఒకవేళ ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి, దుత్తలూరు తదితర ప్రాంతాల రైతులు ఎక్కువగా బొప్పాయి తోటలు సాగుచేస్తున్నారు. సుమారు 15వందల ఎకరాలకు పైగానే ఈ ప్రాంతాల్లో బొప్పాయితోటలు ఉన్నాయి. కరోనా లేనప్పుడు ఢిల్లీ, కోల్‌కత్తా తదితర దూరప్రాంతాలకు ఇక్కడ నుంచి బొప్పాయి బాగా ఎగుమతి అవుతుండేది. ఇప్పుడు ఈ మాయదారి కరోనా జబ్బు దెబ్బతో ఎగుమతులన్నీ ఆగిపోయాయని రైతులు ఆవేదనతో చెప్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో టన్ను బొప్పాయి పండ్ల ధర 20వేల రూపాయల దాకా పలికితే, ఇప్పుడు కనీసం 4వేలు కూడా లేకపోవడంతో బొప్పాయి రైతులు తోటల్లో పండుతున్న పండ్లను ఏమిచేసుకోవాలో అర్ధం కాక అల్లాడిపోతున్నారు.

### నేలపాలవుతున్న బొప్పాయి.. కంటతడిపెడుతున్న రైతాంగం:

బొప్పాయి సాగుకోసం ఎకరాకు లక్ష రూపాయల దాకా వ్యయమవుతున్నప్పటికీ తీరా పంట చేతికి వచ్చేసరికి ఏదో ఒక సమస్యతో ధరలు దిగజారిపోతున్నాయని, తమ కష్టాలు ఎప్పుడు పోతాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కరోనా, లాక్‌డౌన్‌లతో మార్కెట్లు మూసుకుపోవడంతో కోతకు వచ్చిన బొప్పాయి కాయలను తోటల్లోంచి కోసుకురావడం, వాటిని మళ్ళీ దుకాణాలకు తీసుకురావడానికి తగు రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పండిన కాయలను రైతులు విధిలేని పరిస్థితుల్లో చివరికి చెట్లకే వదిలేస్తున్నారు. దీంతో బొప్పాయి పండ్లు బాగా పండి నేలరాలిపోతున్నాయి. వాటిని చూస్తూ రైతులు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. జిల్లాలో కూడా బొప్పాయి ధరలు బాగా తగ్గిపోవడంతో గిట్టుబాటు లేక రైతులు వాటిని తీసుకురావడం తగ్గించేశారు. దీంతో సాగుకోసం చేసిన అప్పులు తీరక, మరోవైపు కుటుంబాలు గడవక రైతులు పడే అవస్తలు వర్ణనా తీతంగా ఉన్నాయి. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ దుస్థితిని పరిశీలించి నష్టాలతో బాధలుపడుతున్న బొప్పాయి రైతులను ఆదుకునేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రైతులకు 'ఈ-కర్షక్' ఎంతో ఉపయోగం

రైతులకు ఈ-కర్షక్ ఎంతో ఉపయోగకరమని, వెంటనే నెల్లూరు మండలంలోని ప్రతి రైతు 'ఈ-కర్షక్' ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న తెలియజేశారు. కరువు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సాగుదారులకు తప్పనిసరిగా పరిహారం చెల్లించేందుకు ఈ-కర్షక్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇందులో నమోదు చేసుకోవడం వల్ల బీమా కూడా వర్తిస్తుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది అందరూ ఈ విషయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

# 21 మంది వీధి బాలల గుర్తింపు



'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా ఈనెల 13న జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 21 మంది వీధి బాలలు, నిరాదరణకు గురైన బాలకార్మికులను గుర్తించారు. నెల్లూరు పోలీసులు, సిడబ్ల్యుసి, ఎన్జీఓలు, రెవెన్యూ, లేబర్, వైద్యారోగ్యశాఖల సమన్వయంతో వీరందరికీ పరీక్షలు నిర్వహించారు. బాలలందరికీ కరోనా వైరస్ వ్యాధి గురించి వివరించి అవగాహన కల్పించారు. వారికి సేఫ్టీ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ ఈనెల 20వ తేది వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కొనసాగుతుందని, 14 సంవత్సరాల లోపు బాల బాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపించి వారి భవిష్యత్‌కు బంగారుబాటలు వేయాలన్నారు.

# ఇంటింటా కరోనా సర్వే చేపట్టాలి

## అధికారులకు ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశం

కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో కరోనాకు సంబంధించి ఇంటింటా సర్వే నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈనెల 13న జిల్లా ఎమర్జన్సీసెంటర్‌లో ఆయన ఆర్డీఓలతో సమావేశమై మాట్లాడుతూ ఆ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక అధికారులు రోజూ పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని కోవిడ్ సెంటర్లలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ నిర్ధారణకు సంబంధించి పల్స్ ఆక్సీమీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వీటితో స్వయంగా ఎలా పరీక్షించుకోవాలో తెలియజేయాలని సూచించారు. కరోనా నేపథ్యంలో ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, మాస్కులు ధరించని వారికి జరిమానాలు విధించాలని అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటి డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ కరాటే పోటీల్లో..

# నెల్లూరీయులు సత్తా చాటారు

ఆన్‌లైన్‌లో ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ కటా చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరీయులు అత్యంత ప్రతిభ కనపరచి అందరి అభినందనలు అందుకున్నారని దేవ్ గొజూర్యు కరాటే సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ తెలియజేశారు. విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను ఈనెల 13న నెల్లూరు నవాబుపేటలోని కరాటే స్కూల్‌లో అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబైకి చెందిన ఒకినోవా గొజూర్యు కరాటే డో ఆధ్వర్యంలో గత నెలలో ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారని, నెల్లూరు నుంచి పది మంది పాల్గొంటే వివిధ విభాగాల్లో ఏడుగురు ప్రథమ స్థానం సాధించి విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు వసంతకుమార్, ప్రదీప్‌కుమార్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# భౌతిక దూరం పాటిస్తే.. కరోనా దూరం

భౌతిక దూరం పాటించడం ద్వారా కరోనా వ్యాధి మనకు వ్యాపించకుండా దూరం చేసుకోవచ్చని, కరోనా వ్యాధి నివారణకు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించి ఆ మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్తపడాలని సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటి డైరెక్టర్ జీవపుత్రకుమార్ తెలిపారు. ఈ నెల 14న నెల్లూరులోని కొండాయపాళెం గేట్ సెంటర్‌లో ఉన్న ఆ శాఖ కార్యాలయంలో కోవిడ్ వైరస్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విధిగా మాస్కులు ధరించాలని, శానిటైజేషన్‌తో పరిశుభ్రత పాటించాలని చెప్పారు. మాస్కు ధరించిన వారికే కార్యాలయంలోని రానిస్తామన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జ్యోతిలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో..

# ఒకరికి కరోనా

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం సిబ్బందిలో ఒకరికి కరోనా పాజిటివ్ రావడంతో దేవస్థానాన్ని ఈనెల 13న మూసివేశారు. భక్తుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని శానిటైజ్ చేసేందుకు ఈనెల 14, 15 తేదీల్లో ఆలయంలో దర్శనాలను నిలుపుదల చేసి, భక్తులెవరూ రావద్దని విజ్ఞప్తి చేస్తూ బోర్డు పెట్టారు.

# ఒకటే ముసురు.. వాన

జిల్లాలో ఎండ బాగా తగ్గిపోయి వాతావరణం చల్లబడింది. రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. మొన్నటిదాకా పెళపెళమంటూ విరుచుకుపడిన ఎండను భరించిన నగర ప్రజలు ఈ వానజల్లులతో ఉపశమనం పొందుతున్నారు. ఒకటే ముసురు.. అప్పుడప్పుడూ వాన. పరిస్థితి చల్లగానే ఉన్నా.. అనేక ప్రాంతాల్లో వర్షపునీరు వెళ్లే మార్గాలు లేక, మురుగు కాలువలతో కలిసి ఆ నీళ్ళన్నీ రోడ్లమీదికొచ్చి భరించలేని దుర్వాసన కలిగిస్తున్నాయి. మురుగుకాలువలు ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవడంతో వాన నీళ్ళు, మురుగునీళ్ళు అన్నీకలిసి కాలువల్లా రోడ్లమీద ప్రవహిస్తుండడంతో పాదచారులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఖాళీస్థలాల్లో వాన నీరు నిలిచిపోయి.. అవన్నీ దోమలగుంటలుగా మారుతున్నాయి. అందుకే ఖాళీస్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ అధికారులు ఎంతగా చెప్తున్నా ఈ పరిస్థితి మారడం లేదు.

### 'నేతన్న నేస్తం'

# పథకాన్ని విస్తరించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వైయస్సార్ నేతన్న నేస్తం' పథకాన్ని చేనేత అనుబంధ వృత్తులవారికి కూడా వర్తింపజేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చక్రధారి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి మెయిల్‌ద్వారా వినతిపత్రాన్ని పంపినట్లు చెప్పారు. రాష్ట్రంలో చేనేతకారులకు ఏటా 24వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేయడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. ఇలాంటి ప్రజోపయోగ పథకాలతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో శాశ్వతమైన స్థానం సంపాదించుకుంటున్నారని ఆయన కొనియాడారు.

# డ్వామా పీడీ బదిలీ

డ్వామా పీడీగా పనిచేస్తున్న జ్యోతిబసును ప్రభుత్వం విజయవాడలోని ఏపిఐఐసి ప్రధాన కార్యాలయంలో అసెట్స్ మేనేజర్‌గా డిప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఆయన స్థానంలో జెడ్పీ సిఇఓ పి.సుశీలకు అదనపు బాధ్యతలను అప్పగించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

### అనాథ బాలలకు

# 'రోటరీ' సాయం

నెల్లూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 13న రాజుపాళెంలోని విశ్వజనని బాలల ఆశ్రమంలోని అనాథ బాలలకు నగదు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రొటేరియన్ విజయరామిరెడ్డి మేనకోడలు హారిక జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. రోటరీక్లబ్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, ముస్తాక్ అహ్మద్, రాఘవేంద్రశెట్టి, ఆశ్రమ ప్రతినిధులు సాగర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### 'వాత్సల్య'లో

# అన్నదానం

నెల్లూరు నగరంలోని జనహిత –వాత్సల్య ఆధ్వర్యంలోని చిన్నారులకు, వృద్ధాశ్రమానికి జిల్లా ప్రభుత్వోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈనెల 12న వారికి అన్నదానంతోపాటు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కరోనా కష్టకాలంలో నిరుపేదలను, అనాథలను అందరూ మానవతా దృక్పథంతో ఆదుకోవాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో కె.ధర్మేంద్ర, పంచాక్షరి మల్లయ్య, సాంబశివరావు, దుర్గాప్రసాద్, మల్లికార్జున, గిరి తదితరులు పాల్గొన్నారు.

### ఆందోళన బాటలో..

# 104 ఉద్యోగులు

పిహెచ్‌సిలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 104 ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నెల్లూరు నగరంలోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నాందోళన నిర్వహించారు. వీరిని పిహెచ్‌సిలలో ఒప్పంద ఉద్యోగులుగా నియమిస్తామని, 28వేల రూపాయలు జీతం ఇచ్చేలా ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజామస్తాన్, గౌరవాధ్యక్షుడు సతీష్, రవీష్ పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# సెలవులో శేషగిరిబాబు

## వినోద్‌కుమార్‌కి విధుల బాధ్యత



జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు సుదీర్ఘ సెలవుపై వెళ్లారు. కరోనా మహమ్మారి జిల్లాలో విపరీతంగా విస్తరిస్తున్న తరుణంలో కలెక్టర్ సెలవుపై వెళ్లడం చర్చనీయాంశమే. వాస్తవానికి చాలా రోజులుగా కలెక్టర్ బదిలీకానున్నారన్న వార్త షికారు చేస్తోంది, అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ పంపిణీ కార్యక్రమం పూర్తయిన తరువాత ఆయన బదిలీ ఉంటుందని అందరూ ఊహించిందే. భూపంపిణీ వాయిదా పడడం, ఈలోగా జిల్లాలో చోటుచేసుకుంటున్న కొన్ని రాజకీయ పరిణామాలు బదిలీ కంటే ముందే ఆయనను సెలవుపై వెళ్లేలా చేశాయన్నది ఇప్పుడు వినిపిస్తున్న మాట. ఆయన తిరిగి వచ్చేవరకు ఆయన విధులకు జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్‌ని ఇన్‌ఛార్జ్‌గా నియమించింది ప్రభుత్వం.

### రైతుల అభ్యున్నతికి...

# 'నాబార్డ్' సేవలు.. అభినందనీయం

**- డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయ**

రైతుల అభ్యున్నతికి నాబార్డ్ సంస్థ అనేక పథకాలను అందిస్తూ ఎంతగానో కృషిచేస్తోందని, సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు నాబార్డ్ చేస్తున్న కృషి అభినందనీయమని డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 13న నెల్లూరు నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నాబార్డ్ చేస్తున్న సేవలను వివరించారు. నాబార్డ్ డిడిఎం రవిసింగ్‌తోపాటు ఎల్‌డిఎం రామ్‌ప్రసాద్‌రెడ్డి, డిసిసిబి సిఇఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారో..

# చర్యలు తప్పవు

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల వారు విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచార్యులు ఈనెల 13న ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని హితవు పలికారు. నిబంధనలు పాటించకుండా విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు చేపడితే ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామన్నారు.

### నిబంధనలు పాటించనందుకు..

# దుకాణాలు సీజ్

నెల్లూరు నగరంలోని పెద్ద బజార్ ప్రాంతంలో ఈనెల 13న పలు దుకాణాల వారు కరోనా నియంత్రణకు సంబంధించిన నిబంధనలు పాటించకపోవడాన్ని గుర్తించి ఆయా దుకాణాలను మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ సీజ్ చేశారు. దుకాణాల్లో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని ఆయన తనిఖీలు చేస్తూ ట్రేడ్ లైసెన్సులు లేని రెండు చీరల దుకాణాలను, ఓ హోల్‌సేల్ ఫ్యాన్సీ దుకాణాన్ని గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సును పొందాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆయనతో పాటు శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు ఉన్నారు.

# భూముల రికార్డులు పక్కాగా ఉండాలి

భూముల రికార్డులకు సంబంధించి ప్రక్షాళన ప్రక్రియను పక్కాగా చేపట్టాలని డిఆర్ఓ మల్లికార్జున తహశీల్దార్లకు సూచించారు. ఈనెల 13న ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ఆగస్టు 15న పేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించనుందని, అందుకు సంబంధించిన పనులన్నీ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# ముందుజాగ్రత్తలతో.. కట్టడి చేద్దాం

**- ఎమ్మెల్యే కాకాణి**



కరోనా పట్ల ఆందోళన వద్దని, ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా కరోనాను కట్టడి చేయవచ్చని ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 13న ఆయన తోటపల్లి గూడూరు మండలంలో క్వారంటైన్ ఏర్పాటుచేస్తున్న కోడూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ సమిష్టికృషితో కరోనాను జయించవచ్చని, కరోనా నియంత్రణకు అధికారులు, ప్రభుత్వం చెప్తున్న సూచనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కరోనాతో బాధపడుతున్నవారికి మెరుగైన చికిత్సలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి మండలంలో క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటుచేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని అధికారులందరూ కరోనా నియంత్రణకు ఎంతగానో కృషి చేస్తున్నారని అభినందించారు. కరోనా నియంత్రణలో దేశంలో మన రాష్ట్రమే ముందుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, కావలిరెడ్డి రంగారెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సునీల్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 'నాడు-నేడు' పనుల్లో నాణ్యత ముఖ్యం

మనబడి 'నాడు-నేడు' పనుల్లో నాణ్యత అత్యంత ముఖ్యమని, ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడవద్దని గుంటూరు ఆర్‌జేడి రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి, కసుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన ఈనెల 13న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం అమలు చేస్తోందని, పనుల్లో నాణ్యత లోపించకూడదని, పనులను వేగవంతం చేసి ఈ నెలాఖరు కల్లా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు తెలియజేశారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ఉంటూ ఈ పనులను వేగవంతం చేసేందుకు సహకరించాలన్నారు. ఆయన వెంట డిఇఓ జనార్ధనాచార్యులు, ఎంఇఓ మధుసూదన్, మస్తానయ్య తదితరులున్నారు.

# అసలే కరోనా వాత..ఆపై ఆసుపత్రుల మూత!

అసలే కరోనా మహమ్మారి వ్యాధి ఎక్కడ తగులుకుంటుందోనని ప్రజలు బెంబే లెత్తుతుంటే మరోవైపు ఆదుకోవాల్సిన ఆసుపత్రులు కూడా మూత పడుతుం డడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరోనా సంగతి తర్వాత, ఏదైనా అత్యవసర వైద్యం కావాలంటే ఏం చేయాలని వారు కలవరపడుతున్నారు. కరోనా దెబ్బతో ఆసుపత్రులు మూతపడడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ప్రాథమిక వైద్యం కూడా అందక ఇబ్బందులు పడుతున్నారు. బోగోలు, అల్లూరు మండలాల్లో ఈ దుస్థితి ఎదురవుతోంది. కోవూరుపల్లి ఆసుపత్రి సిబ్బందిలో ఒకరికి, అల్లూరులో ఒక వైద్యునికి కరోనా పాజిటివ్ రావడంతో ఆ ఆసుపత్రులు మూసేశారు. రెండు ఆసుపత్రుల్లోని సిబ్బంది వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారు. దీంతో ప్రజలకు అవసరమైన ప్రాథమిక వైద్యం అందుబాటులోకి రావడం లేదని ప్రజల ఆవేదన.. జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి ఈ పరిస్థితులను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

### అనుమతించిన రీచ్‌ల నుంచి..

# ఉచితంగా ఇసుక

జిల్లాలో అనుమతించిన ఇసుక రీచ్‌ల నుంచి స్థానిక అవసరాల కోసం ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను ఉచితంగా తీసుకుపోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌లు తెలియజేశారు. ఈ నెల 13న వారు నెల్లూరులోని డిపిఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా అనుమతి మేరకు ఈ ఏర్పాటు ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ డెప్యూటీ డైరెక్టర్‌ల అనుమతి పొందిన ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న గృహనిర్మాణాలకు, గ్రామ సచివాలయాల నిర్మాణాలు వగైరాలకు ఉచితంగా ఇసుక పొందవచ్చన్నారు. ఇసుక రీచ్ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నవారికి మాత్రమే ఈ విధంగా ఇసుకను ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా తీసుకుపోయేందుకు అనుమతిస్తామన్నారు. ఇసుక రీచ్‌నుంచి ఇసుకను తరలించేందుకు అయ్యే ఖర్చును లబ్దిదారుడు భరాయించాలని, ఇసుకను తవ్వడానికి యంత్రాలను వాడకూడదని పేర్కొన్నారు. లబ్దిదారుడు నిర్మాణంలో ఉన్న ఇంటి ఫోటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డును జతపరచి అన్ని వివరాలతో గ్రామసచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని సూచించారు.

# నూరుశాతం ఉత్తీర్ణత

**- జవహర్ నవోదయ విద్యార్థుల ప్రతిభ**

మర్రిపాడు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ఎంపిసి విభాగంలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో ఆత్మకూరు రాజేష్ అనే విద్యార్థి 466 మార్కులతో అగ్రస్థానంలో ఉండగా, గుంజి చైతన్య 464 మార్కులతో ద్వితీయ స్థానంలోను, సురే శ్రీనివాసులురెడ్డి 460 మార్కులతో తృతీయ స్థానంలోనూ నిలిచి విద్యాసంస్థకు మంచిపేరు తెచ్చారని ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసరావు వారిని అభినందించారు.

# బకాయిలు ఇప్పించండి

**- రేషన్ డీలర్ల ఆందోళన**

కరోనా వ్యాధి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికి ఏడుసార్లు రేషన్ పంపిణీ చేస్తే కేవలం రెండుసార్లు మాత్రమే కమీషన్ ఇచ్చారని, మిగిలిన బకాయిలు వెంటనే ఇప్పించి తమను ఆదుకోవాలని కోరుతూ వెంకటగిరిలో రేషన్ డీలర్లు ఈనెల 13న ధర్నాందోళన చేశారు. కరోనా నేపథ్యంలో వేలిముద్రలు లేకుండా రేషన్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మాస్కులు పంపిణీ చేయాలని కోరుతూ తహశీల్దార్ ఆదిశేషయ్యకు వినతిపత్రం అందజేశారు.

### పెంచలకోన సత్రాల్లో..

# పెళ్ళిళ్ళు వద్దు

కరోనా మహమ్మారి వ్యాధి నేపథ్యంలో జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఉన్న కళ్యాణమండపాలు, సత్రాల్లో పెళ్ళిళ్లు, ఉపనయనాలు, అన్నప్రాసనలు వగైరాలను నిర్వహించకూడదని, వాటికి అనుమతి లేదని దేవాదాయశాఖ ఏసి వెంకటసుబ్బయ్య వాటి యజమానులకు ఈనెల 12న నోటీసులిచ్చి మరీ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా భక్తులు అన్నదానం చేయాలనుకుంటే ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలోనే అందించాలని ఆయన చెప్పారు.

# ప్రజలకు అండగా ఉంటాం

**- సర్వజ్ఞకుమార యాచేంద్ర**

వెంకటగిరి ప్రజలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని, అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా కరోనా నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నామని వెంకటగిరి రాజా, ఆంధ్ర క్రికెట్ ఉపాధ్యక్షుడు, వెంకటగిరి రాజ సేవాసమితి ఛైర్మన్ వి.సర్వజ్ఞ కుమార యాచేంద్ర చెప్పారు. కరోనా నియంత్రణలో భాగంగా ఆయన ఈనెల 13న తన సొంత నిధులతో వెంకటగిరి పట్టణంలో హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలోని అన్ని కంటైన్‌మెంట్ జోన్‌లలో ఈ ద్రావణం చల్లే ఏర్పాటు చేశామని, పోలేరమ్మ తల్లి దయవల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రార్థిస్తున్నామన్నారు. వైకాపా నాయకులు డి.రామకృష్ణ, కె.రమేష్ పాల్గొన్నారు.

## కాలధర్మం

# పి.టి.రంగరాజన్



పి.టి.గోపాలాచారి & సన్స్ అంటే నెల్లూరులో పాతతరం నుండి నేటి తరం వరకు తెలియని వారు వుండరు. పెట్రోల్ డీజిల్, కిరోసిన్ డీలర్లుగా నెల్లూరు నగరంలో ఖ్యాతిచెందిన కుటుంబం వారిది. గోపాలాచారి మనుమడు, పి.టి రామానుజం రెండవ కుమారుడు పి.టి.రంగరాజన్ జులై 11వ తేదీ శనివారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. రంగరాజన్ వయస్సు 66 సంవత్సరాలు. ఆయనకు భార్య అలిమేలు, ఇద్దరు కుమార్తెలు వున్నారు.

రంగరాజన్‌కు సామాజిక, వ్యాపార వర్గాల వారితో పాటు రాజకీయ నాయకులతోనూ మంచి సంబంధాలున్నాయి. నందమూరి తారకరామారావు వీరాభిమానిగా తెలుగుదేశం పార్టీ పట్ల ఆకర్షితుడై రాజకీయ రంగ ప్రవేశం చేశాడు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా, జిల్లా పార్టీ కోశాధికారిగా కూడా పని చేశాడు. ఆదాల ప్రభాకర్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా వుంటూ గత ఎన్నికల సమయంలో ఆయనతోపాటు వైసిపిలోకి మారాడు.

నెల్లూరులో అయ్యప్ప గుడి నిర్మాణానికి ముందు గాంధీ బొమ్మవద్ద గల కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో మురళీకృష్ణ గోపాలయ్య ఆధ్వర్యంలో 40 రోజులపాటు జరిగిన అయ్యప్ప స్వామి బ్రహ్మోత్సవాలలో గోపాలయ్యకి చేదోడు వాదోడుగా వుంటూ జోలె పట్టి నగరంలో యాచన చేసిన వారిలో రంగరాజన్‌ది ముఖ్య పాత్ర. గోపాలయ్య, ఆయన ఇతర మిత్రబృందం ఆధ్వర్యంలో అప్పట్లో అయ్యప్ప దేవాలయం నిర్మాణం జరిగింది. ఆ తరువాతి కాలంలో గుడి పట్ల గుడి అభివృద్ధి పట్ల ఎక్కువ శ్రద్ధ కనపరచిన రంగరాజన్ గుడి కమిటీకి శాశ్వత అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు.

కొన్ని వేలమందికి ఆయన గురుస్వామిగా అవతరించడమే కాకుండా 47సార్లు మాలధారణ చేసి శబరిమలకు వెళ్ళొచ్చాడు. శబరిమల వరకూ వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం నెల్లూరు అయ్యప్ప గుడిలోనే 18మెట్లను నిర్మించిన ఘనత కూడా రంగరాజన్‌కే దక్కుతుంది.

జిల్లా ఆధ్యాత్మిక సారధి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో అయ్యప్పస్వామి కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించడంలో రంగరాజన్‌ది కీలక పాత్ర, రంగరాజన్ ఆధ్వర్యంలోనే అయ్యప్ప గుడి ప్రాంగణంలో మూడేళ్ళక్రితం గురువాయూరప్ప ఆలయం నిర్మాణం కూడా జరిగింది.

రంగరాజన్ మంచి స్నేహశీలి, లాయర్ పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డిని ఈయన గురు సమానంగా చూసేవాడు, ఇద్దరి మధ్య బలమైన గురు శిష్య బంధం కొనసాగేది.

పల్లికర్ల తిరుమల రంగరాజన్ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ ....ఇంటి పెద్ద ఆకస్మిక మరణంతో శోకసముద్రంలో వున్న వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలువుతోంది 'లాయర్'.

# కె.ఎస్.రావు



విలక్షణ రంగస్థల నటుడు కెయస్ రావు (కామరాజుగడ్డ సుందరేశ్వరరావు) ఈనెల 12న కన్నుమూశారు. ఆయన గత కొద్దికాలంగా అస్వస్థతతో ఉన్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కెయస్ రావు మంచి నటుడు.. సౌమ్యుడు, స్నేహశీలి కూడా. తన విశిష్టమైన నటనతో నెల్లూరు పౌరాణిక నాటకరంగానికి ఎంతో కీర్తి తెచ్చిన కెయస్ రావు మృతి బాధాకరం. వీరి తాతగారి పేరు కూడా కామరాజుగడ్డ సుందరేశ్వరరావే. ఆయన గొప్ప రంగస్థలనటుడు. పౌరాణిక నాటక రంగంలో అద్వితీయుడనిపించుకున్న మహానటుడాయన. తాతగారి పేరు పెట్టుకోవడమే కాక ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని నాటకరంగంలోనూ మంచికీర్తిని తెచ్చుకుని తాతగారి పేరు నిలబెట్టాడు.. 'కెయస్‌రావు' పాత్రోచిత నటనతో నాటకాల్లో మంచి నటునిగా రాణించి అందరి అభినందనలు అందుకున్నాడు. ముఖ్యంగా 'నారద' పాత్రలో ఆయన నటనకు రాష్ట్రవ్యాప్తంగా పేరు.

అంతేకాదు, నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న కెయస్ రావు ఆయుర్వేద మందులషాపు కూడా అందరికీ తెలిసిందే. సాయంత్రమైతే చాలు ఈ దుకాణం వద్ద నాటకాభిమానులంతా చేరేవారు. దుకాణం సంగతి తర్వాత, ముందు రిహార్సల్స్ వగైరాల విషయాలన్నీ ఇక్కడే మాట్లాడుకునేవారు. నాటకరంగ విశేషాలన్నీ గంటల తరబడి ముచ్చటించుకునేవారు. 'లాయర్' వ్యవస్థాపకులు దివంగత తుంగా రాజగోపాలరెడ్డికి కెయస్ రావు మంచి మిత్రులు, ఆత్మీయులు కూడా.

కెయస్ రావు ఆకస్మిక మృతికి ఆయన అభిమానులు, సన్నిహితులు అందరూ ఎంతో బాధపడ్డారు. తన విశిష్టమైన నటనతో ప్రతిష్టాత్మకమైన 'నంది' అవార్డును కూడా సాధించి నెల్లూరుకు ప్రఖ్యాతిని తెచ్చిన నటుడు కెయస్ రావు అని, ఆయన మృతి నాటకరంగానికి తీరని లోటని శ్రీనివాస నాట్యమండలి వ్యవస్థాపకుడు తిరుపతి హరగోపాల్‌తో పాటు పలువురు నటులు, రంగస్థల కళాకారులు ఆయనకు తమ సంతాపాన్ని తెలిపారు. ఏదేమైనా కెయస్ రావు మృతితో నెల్లూరు పౌరాణిక నాటకరంగం ఒక మంచి నటుడిని కోల్పోయింది. ఆ లోటు ఎవరూ పూడ్చలేనిది.

ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



# గూడూరు డివిజన్ వార్తలు

## స్మశానవాటికను ఏర్పాటు చేయండి



చెన్నూరు గ్రామంలోని అరుంధతీయవాడలోని ప్రజలు ఎన్నో సంవత్సరాల నుండి స్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మృతిచెందితే ఆ మృత దేహాలను చెరువు లోనే ఖననం చేయాల్సి వస్తోందని, వర్షాకాలం వచ్చిందంటే చెరువు నిండడం వల్ల అక్కడ ఖననం చేయలేక అవస్తలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ అభ్యర్థన మన్నించి తమ ప్రాంతంలో స్మశానవాటికను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యే వరప్రసాదరావును కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

## బాలుని వైద్యానికి చేయూత



షణ్ముఖ శశాంక్ అనే నాలుగేళ్ళ బాలుని వైద్య చికిత్సల ఖర్చు కోసం వారి కుటుంబసభ్యులకు గూడూరులోని చేగువేరా ఫౌండేషన్ తరపున తహశీల్దార్ లీలారాణి, వైకాపా నాయకులు, చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు, ఫౌండేషన్ అధ్యక్షులు గుండాల ఆది నారాయణ, ఉపాధ్యక్షుడు క్రాంతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కమిషనర్‌తో కలిసి పర్యటించిన బల్లి కళ్యాణచక్రవర్తి

## సమస్యలు పరిష్కరించేలా చర్యలు

పురిటిపాలెంలో తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాదరావు తనయుడు బల్లి కల్యాణ చక్రవర్తి సోమవారం మున్సిపల్ కమిషనర్ ఓబులేసుతో కలిసి పర్యటించాడు. ఆ ప్రాంతంలోని పలు సమస్యలపై స్థానికులు ఆయనకు విన్నవించారు. వైకాపా నాయకులు రాధారెడ్డి, శ్రీహరి, ప్రభాకర్, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, పవన్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైజేపీ లయన్స్ ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న అధ్యక్షులు నవీన్ జయకుమార్

2020-2021కి గాను వైజేపీ లయన్స్ క్లబ్ కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం ఆదివారం సరస్వతి శిశు మందిరంలో బయ్యా రవికుమార్, వైజేపీ లయన్స్ గవర్నర్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షులుగా నీలకంఠం నవీన్ జయకుమార్, కార్యదర్శిగా సుధాకర్, ట్రెజరర్‌గా శివరాం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నవీన్ జయకుమార్ మాట్లా డుతూ లయన్స్ క్లబ్ తరపున మెడికల్ క్యాంపులు, మంచి సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు మురళీనాయుడు, ఆర్.వి.రావు, మంజులదేవి, వాసవి క్లబ్ గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి చెంచురామయ్య పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకులు



కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న పాశం సునీల్

గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్ పేట ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నంబూరు వెంకటేశ్వర్లునాయుడు, పిట్టి గోపాలనాయుడు దాతృత్వంతో మాజీఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతులమీదుగా సోమవారం పేద కుటుంబాలకు కూరగాయలను, కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాశం సునీల్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండి కరోనా నివారణకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, బిల్లు చెంచురామయ్య, శివకుమార్, గురవయ్య, ఆలీ, మోహన్, రమేష్, చంద్రమౌళి, శ్రీనివాసులు, మధురెడ్డి పాల్గొన్నారు.

## సిబిఎస్ఇలో ఎల్ఏపి విజయదుందుభి



2019-20 సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ఎ.అనూహ్య(488) జిల్లాలోనే ద్వితీయ స్థానంలో నిలువగా, కె.శర్వాణి(484), ఎం.మేఘన(481), ఎం.వర్షిత (481) మంచి మార్కులను సాధించారని గూడూరు మండలం, చిల్లకూరులోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ ఛైర్మెన్ సుబ్రహ్మణ్యంరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. పరీక్షకు హాజరైన 91 మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులవగా, 31 మంది విద్యార్థులు 90% మార్కులను సాధించారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ సుధేష్ణ, ప్రధానోపాధ్యాయులు నమఃశివాయ పాల్గొని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## నిరుపేదలకు 'ప్రగతి' సాయం



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న చిల్లకూరు ఎన్‌సి కాలనీలోని రెడ్‌జోన్ ప్రాంతంలో ఉన్న నిరుపేదలు.. పాతిక కుటుంబాలవారికి వారానికి సరిపడా కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు చేతుల మీదుగా వారికి ఈ సాయం అందజేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రహ్మణ్యం, కరిముల్లా, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వాచ్‌షాప్ రాము, వాలంటీర్లు పాల్గొన్నారు.


## వాస్తవాలను కళ్ళకు కట్టే..తిప్పావఝుల నానీలు

గ్రంథ సమీక్ష

*'ఉపాధ్యాయునిగా*
*పదవీ ముగింపు*
*కలం బూని*
*నానీ కవిగా రాణింపు'..*

ఇదీ తిప్పావఝుల సుబ్రహ్మణ్యం రచించిన ఒక నానీ. అందులో అన్నట్లే ఆయన వృత్తి.. బోధన, ప్రవృత్తి రచన. పదవీ విరమణ తర్వాత వృత్తీ, ప్రవృత్తీ రచనే!.. నెల్లూరుజిల్లాలోని దగదర్తిలో జన్మించి, ఉపాధ్యాయవృత్తిలో కొన సాగి, ఇందుకూరుపేట మండలంలో నివసిస్తున్న తిప్పావఝులకు తొలినుంచీ కవిత్వం పట్ల మక్కువ ఎక్కువ. ఇది వరకు ఆయన ఆరు నానీల సంపుటాలను ప్రచురించి ఉన్నారు. ఇది ఏడవది. 'నానీ'లకు ఆద్యుడైన ఆచార్య యన్.గోపి ఆశీస్సులతో ఈ 'నానీల ఫలశ్రుతి'ని రచించినట్లు ఆయన చెప్పుకున్నారు. ఆచార్య గోపి ప్రోత్సాహంతో నెల్లూరీయులైన డాక్టర్ పెళ్ళకూరు జయప్రద మొదట నానీలు రాయడమే కాక, రాష్ట్ర స్థాయి పురస్కారంతో నానీలు రాసే కవులను ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహంతోనే తిప్పావఝుల ఇప్పటికి 2020 నానీలు రాశారు. నెల్లూరు ప్రాంతంలో నానీల పంట పండిస్తున్నారు.

నానీల సహజ లక్షణం 'అల్పాక్షరముల ననల్పార్థ రచన'. భాష సరళంగా ఉండడం, భావం సంక్షిప్తంగా ఉండి



రచన :
**తిప్పావఝుల సుబ్రహ్మణ్యం**
వెల : రూ.100/-

**ప్రతులకు:**
**తిప్పావఝుల సుబ్రహ్మణ్యం**
**ఇందుకూరుపేట, నెల్లూరు.**
**సెల్. 9177823804**

ఆలోచింపజేయడం నానీల ప్రత్యేకత. 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అనే మాటా నానీల విషయంలో నిజమే!..పిల్లలతో బోధనలో కాలం గడిపిన తిప్పావఝుల మంచి వ్యక్తిత్వం ఉన్నవారు. మంచి వ్యక్తే మంచి కవిత్వం రాయగలడు. 'నా చిన్న తనంలో వీరి దగ్గర చదువుకుని ఉంటే ఇంతకన్నా మంచి మనిషినయ్యే వాణ్ణేమో.. అని ఆచార్య యన్.గోపి అన్నారంటే తిప్పావఝుల వ్యక్తిత్వం గురించి ఇక చెప్పాల్సింది ఏముంటుంది?.. 'నా సృషి..కురుతే కావ్యం' అని పెద్దలన్నారు కదా! కవికి తనదైన తాత్వికత ఉంటుంది. తనకంటూ ఒక కవితా ప్రపంచం ఉంటుంది. మనసు పొరల్లో దొర్లుతున్న కవితాక్షరాలను పదాలుగా కూర్చడమే కవి పని. తనకు తానుగా అనుభవించి, భావించి, శోధించి, శోకించి, హృదయాన్ని రగిల్చి, కలాన్ని కదిలించి నానీలకు అక్షరాలను కూర్చారు. అందుకే ఒకచోట

*'జీవితం లోంచే*
*పుడుతుంది కవిత్వం*
*కలలు కనడమే*
*దాని తత్వం'..*అన్నారాయన.

అనేకానేక అంశాలపై, వార్తాకథనాలపై కూడా తిప్పావఝుల అనేక నానీలు రాశారు. మానవహక్కులు, బ్యాంకుల సమ్మె, రాజకీయాలు, మద్యపానం, ఆరోగ్యం.. ఇలా ఎన్నో విషయాల మీద నానీలు చెప్పారు. వాస్తవాలను కళ్ళకు కట్టారు.

*'అమ్మపై ప్రేమతో*
*తీసుకెళ్ళాడు మలేషియా*
*పాపం*
*అమ్మయింది ఆయా!'..*

అంటారొకచోట. ఎంత సత్యం దాగుందో కదా ఈ నానీలో!.. అదే విధంగా 'తగినంత ఉప్పు.. దేహానికి ఒప్పు..హెచ్చు తగ్గులయితే..ఆరోగ్యానికి ముప్పు'.. అంటారు మరోచోట. 'జీవితం.. ఒక వాక్యం. కామాలతో సాగుతుంది.. ఫుల్‌స్టాప్‌తో ఆగుతుంది''.. చూడండి ఈ నానీలో ఎంత తాత్వికత ఉందో!..

*'రంగు వేరైనా*
*ఒక్కటేగా నేల*
*వర్ణమేదైనా*
*మనుషుల మధ్య వైరమేల?..*

అంటారు మరోచోట. ఇలా ఎన్నో అత్యద్భుతమైన నానీలతో ఆయన రచనలు సాగాయి. మొత్తంగా 7 సంపుటాలు (2020 నానీలు) వెలువరించి తన లక్ష్యాన్ని సాధించుకున్న తిప్పావఝుల గారు ధన్యులు!.. అయితే, నానీలను ఆపకుండా మరిన్ని మంచి నానీలతో ఆయన కవితాలోకంలో మరింత ఖ్యాతి తెచ్చుకోవాలని ఆశిద్దాం!..



సమీక్షకులు:
**డా. గంగిశెట్టి శివకుమార్**
**నెల్లూరు. ఫోన్. 9441895343.**

### పెద్దాసుపత్రిలో వసతులు బాగాలేవంటూ...

# కరోనా రోగుల గగ్గోలు

కరోనా పాజిటివ్ వచ్చిన రోగులను పెద్దాసుపత్రిలో క్వారెంటైన్ చేస్తున్నారు. రోగి వ్యాధి తీవ్రతను బట్టి 4 రోజుల నుండి 14రోజులవరకూ రోగులను ఇక్కడ ఉంచుతారు. అయితే ఇక్కడ వసతులు బాగా లేవని, ముఖ్యంగా ఆహారం అందించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అక్కడి రోగులు గగ్గోలు పెడుతున్నారు.

కరోనా బారినపడి పెద్దాసుపత్రిలో చేరిన సాక్షాత్తు ఒక పత్రికా విలేకరికే ఈ చేదు అనుభవం ఎదురై వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ఉదయం 9.30 వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వడం లేదని అలాగే మధ్యాహ్నం, రాత్రి భోజనం కూడా ఆలస్యంగా ఇస్తున్నారన్నది వారి ఆవేదన. ఇక పౌష్టికాహారం ఇవ్వాల్సిన పరిస్థితులలో ఆహారం కూడా నాసిరకంగా ఉంటుందంటున్నారు. కనీసం ఉదయం పూట ఒక గ్లాస్ పాలు కూడా ఇవ్వడంలేదట. కరోనాతో పాటు ఇతర బి.పి, షుగర్ వంటి వ్యాధులున్నవారికి సమయానికి ఇవ్వవలసిన మందులు కూడా సరిగా ఇవ్వడంలేదని చెప్తున్నారు.

మంచినీళ్ల సీసాలలో కూడా పురుగులు ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్లలో కనీస వసతులుకూడా లేవని రోగులకు సరిపడా మరుగుదొడ్లు లేక పోయినప్పటికి ఉన్న వాటిల్లో వసతులు శూన్యమని, కనీసం వాటికీ సరిపడా బకెట్లు మగ్గులు కూడా లేవని బాధ పడుతున్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తే కరోనా సంగతి దేముడెరుగు ఇతర వ్యాధులతో ప్రాణాలు పోయేలా ఉన్నాయని వారు వాపోతున్నారు. ఈ విషయాలన్నీ వెలుగులోకి తెస్తూ సోషల్ మీడియా ద్వారా వీడియోలు, ఫోటోలు పెడుతున్నారు.

రోగులకు మంచి ఆహారం అందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులకు పదే పదే ఆదేశాలిస్తున్నప్పటికీ క్రింది స్థాయిలో అవి అమలు జరగకపోగా, ఇలాంటి విపత్కర పరిస్థితులలో కూడా సంపాదన కోసం కక్కుర్తిపడుతూ ప్రజల ఆరోగ్యాలతో కంట్రాక్టర్లు చెలగాటమాడటం బాధాకరమని రోగులంటున్నారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని రోగులు కోరారు.



## మండిపడ్డ మంత్రి అనిల్

- సిబ్బంది పై చర్యలు

పెద్దాసుపత్రిలో కరోనా రోగుల అవస్థలు మంత్రి అనిల్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆయన మండిపడ్డారు. సోమవారం అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించిన అనిల్.. నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టాయిలెట్లలో బకెట్లు మగ్గులు పెట్టే విషయం కూడా నేను చెప్పాలా అంటూ క్లాసు పీకాడు.

కరోనా రోగుల విషయంలో నిర్లక్ష్యం తగదని, రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ట దిగజారిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించాడు.

మంత్రి జోక్యంతో మేల్కొన్న అధికారులు తప్పులు సరిదిద్దుకునే పనిలో పడ్డారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడిన జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఇంతగా నిర్లక్ష్యానికి కారణమైన ఇద్దరు డాక్టర్లకు మెమోలిచ్చామని, ఇద్దరు నర్సులను సస్పెండ్ చేశామని, ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విధుల నుండి తొలగించామని, ఆహారం సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను మార్చేశామని చెప్పాడు.

మొత్తానికి సామాజిక మాధ్యమంలో వచ్చిన వీడియోలు మంత్రిదాకా చేరి అధికారుల్లో చలనం తెప్పించి కరోనా రోగుల కష్టాలు తీరేలా చేశాయి.

# గుళ్ల దొంగ.. దొరికాడు

- వెండి శఠగోపాలు, ఆభరణాలతో సహా 1.30 లక్షల చోరీసొత్తు స్వాధీనం
- మరో నిందితుడి కోసం గాలింపు



జిల్లాలోని ఆలయాల్లో జొరబడి అందినంత సొత్తు దోచుకుపోయే దొంగ ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడి వద్ద నుంచి 1.30 లక్షల విలువైన సొత్తును కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈనెల 13న నెల్లూరు క్రైం బ్రాంచ్ సిఐ బాజీజాన్ సైదా విలేకరులకు ఆ వివరాలు తెలిపారు.

జిల్లాలోని పలు దేవాలయాల్లో హుండీలు, ఆభరణాలు దోచుకుపోతున్న దొంగల ఆట కట్టించేందుకు జలదంకి పోలీసులతో కలిసి ప్రత్యేకబృందాన్ని ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టామని, ఎంతో కాలం నుంచి తప్పించుకు తిరుగుతున్న తోటపల్లిగూడూరు మండలంలోని పాత కోడూరుకు చెందిన పాత నేరస్తుడు పల్లికొండ శివను జలదంకి మండలంలో అరెస్ట్ చేసి విచారించగా నిందితుని వద్ద 11 కేసులకు సంబంధించిన చోరీసొత్తు దొరికిందని, దానిని స్వాధీనం చేసుకున్నామని, వాటిలో ఆలయాల్లోని వెండి శఠగోపాలు, వెండి ఆభర ణాలు, బంగారు తాళిబొట్లు కూడా ఉన్నాయన్నారు. ఈ పాత నేరస్తునిపై రెండుసార్లు హత్యకేసులు, దేవాలయాల్లోనూ, తాళాలు వేసిన ఇళ్లల్లోనూ దొంగతనాల కేసులున్నాయని, అందుకు జైలుశిక్ష కూడా పడిందని అన్నారు. నిందితుడిని విచారించగా తన బంధువైన పల్లికొండ శ్రీనివాసులుతో కలసి 11చోట్ల దొంగతనాలు చేసినట్లు చెప్పాడన్నారు. శ్రీనివాసులు పరారీలో ఉన్నాడని తెలిపారు. నిందితుడిని అరెస్ట్‌చేసి సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన సిసిఎస్ ఎఎస్ఐ జె.వెంకయ్య, హెడ్‌కాని స్టేబుళ్ళు వారిస్‌అహ్మద్, ఆర్.సత్యం, కానిస్టేబుళ్ళు అరుణ్‌కుమార్, నరేష్, ఎం.సుబ్బారావులను జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ అభినందించారని ఆయన తెలిపారు. సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జి.ఎల్ శ్రీనివాసరావు, జలదంకి ఏఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.



### నవ నారసింహ క్షేత్రాల్లో ప్రముఖమైనది..

# పెంచలకోన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

*నెల్లూరు జిల్లాలో ఎంతో పురాతనమైన పుణ్యక్షేత్రంగా పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రసిద్ధి. కృతయుగంలో.. శ్రీమహావిష్ణువు తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేందుకు నరసింహావతారంతో హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం అదే ఆగ్రహంతో ఇక్కడున్న వెలిగొండల్లో భీకరంగా గర్జిస్తూ సంచరించాడని, ఆ తర్వాత నరసింహస్వామి ఇక్కడ తన దేవేరులతో శిలారూపంగా అవతరించాడని చరిత్ర. దుష్టశిక్షణకు-శిష్ట రక్షణకు ప్రతీకగా ఈ దేవాలయం వెలసిందని ప్రతీతి.*

**మన దేవాలయాలు 4**

పెంచలకోన.. అంటేనే భక్తుల మనసు పులకిస్తూ ఉంటుంది. నెల్లూరుకు 80, రాపూరుకు 30 కిలోమీటర్ల దూరంలో నెల్లూరు-కడప సరిహద్దుల్లో ఉన్న అత్యంత పురాతనమైన పుణ్యక్షేత్రం ఇది. రాపూరు మండలంలోని ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది.

ఈ ప్రాంతం చుట్టూ కొండలు కోనలతో.. ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రకృతి సోయగాల మధ్య పెనుశిలగా మారి కొలువై ఉన్న ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవా లయం ఆవిర్భావం గురించి పలు రకాల గాధలు ప్రచారంలో ఉన్నాయి.

**ఆలయ చరిత్ర :**

దశావతారాల్లో నరసింహావతారం ఒకటి అనేది అందరికీ తెలిసిందే. అందుకు ప్రతీకగా పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని చెప్తుంటారు కూడా.

పురాతనకాలంలో ఇది చెంచుల కోనగా పిలవబడేదని, అదే ఇప్పుడు పెంచలకోనగా మారిందని పెద్దలు చెప్తుంటారు. కృతయుగంలో శ్రీమహావిష్ణువు తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేందుకు నరసింహావతారంతో వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఇక్కడున్న అడవుల్లో భీకరంగా గర్జిస్తూ సంచరిస్తున్న సమయంలో ఈ ప్రాంతంలోని చెంచురాజు కుమార్తె చెంచులక్ష్మీదేవి తన చెలికత్తెలతో అడవిలో విహరిస్తుండగా, స్వామివారి భీకరరూపాన్ని చూసిన చెలికత్తెలు భయపడి పారిపోయారని, చెంచులక్ష్మీదేవి మాత్రం స్వామివారిని చూస్తూ అలాగే నిలబడిందని, దీంతో ఆమె ధైర్యసాహసాలకు ముగ్ధుడైన స్వామివారు చెంచురాజును ఒప్పించి ఆమెను పరిణయమాడారని పురాణ కథనం. స్వామివారు, అమ్మవారు ఇక్కడ పెనవేసుకుని శిలారూపంలో స్వయంభువుగా వెలియడంతో ఈ కోనకు 'పెనుశిల కోన' అని పేరు వచ్చిందని, అదే 'పెంచలకోన'గా పేరుపడిందని చరిత్ర. ఇదే సందర్భంలో చెంచులక్ష్మీదేవిని స్వామివారు వివాహమాడారన్న విషయం తెలుసుకున్న స్వామివారి దేవేరి ఆదిలక్ష్మీదేవి అలిగి..అక్కడున్న ఏటి అవతలిగట్టుకు వెళ్లిపోయినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకు నిదర్శనంగా ఇక్కడ ఆదిలక్ష్మీదేవి అమ్మవారికి ఆలయం ఉంది. ఈ ఆలయం సమీపంలోనే ఆంజనేయస్వామిగుడి కూడా ఉంది.

ప్రాచీనకాలంలో కణ్వమహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేస్తూ స్వామివారిని సేవించుకునేవారని, ఆశ్రమం పక్కనే ఉన్న ఏరును 'కణ్వలేరు'గా పిలిచేవారని, కాలక్రమంలో అది 'కండలేరు'గా మారి ఉంటుందని మరో కథనం. ఆలయం పక్కనే ఓ కిలోమీటరు దూరంలోనే దట్టమైన అడవులు, కొండలు, కోనలు, జలపాతాలు సప్త తీర్థాలుగా పిలిచే ఏడు నీటి గుండాలు భక్తులను ఆకట్టుకుంటుంటాయి.

**కోరిన కోర్కెలు తీర్చే.. కొండికాసుల వాడు :**

నెల్లూరు-కడప జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ ఆలయం జిల్లా కేంద్రమైన నెల్లూరుకు సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఆలయం దట్టమైన అడవిలో ఉన్నప్పటికీ కీటకాలు, క్రూర మృగాలు.. విషసర్పాల నుంచి భక్తులకు ఎలాంటి ఆపదలు కలగవు కనుక స్వామి వారు 'కొండికాసుల వాడు'గా ప్రసిద్ధి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. నెల్లూరు, కడప జిల్లాల్లో అనేకమంది పెంచలయ్య, పెంచలమ్మ పేర్లతో ఉంటారు. పెంచల స్వామిని ఆరాధించే కుటుంబాల వారు ఇలా తమ బిడ్డలకు నామకరణం చేసుకోవడం అదృష్టంగా భావిస్తుంటారు. ఈ అడవుల్లో ఉన్న ఓ చిన్నపల్లె గోనుపల్లె. చెంచులక్ష్మీదేవి నివసించిన ప్రాంతం ఇదే. ఇప్పటికీ బ్రహ్మోత్సవాల సమయంలో తమకు అల్లుడైన పెంచలస్వామికి చెంచులంతా కలిసి తొలి నివేదనగా పండ్లు సమర్పిస్తుండడం నేటికీ ఆనవాయితీ. వెలిగొండల కొండల్లో వెలుగొందుతోన్న ఈ నృసింహ క్షేత్రం.. దక్షిణ భారతదేశంలోని నరసింహ క్షేత్రాల్లో ఒకటి కావడం విశేషం! ప్రఖ్యాతమైన నవ నారసింహక్షేత్రాల్లోని చిత్రవట నారసింహక్షేత్రమే.. ఈ పెంచలకోన క్షేత్రం కావడం మరో విశేషం!!

వీక్షణం - మంజీర

# 'రామాయపట్నం'.. భేతాళ కథేనా?

**రామాయపట్నంలో పోర్టును త్వరలోనే డెవలప్ చేస్తాం..**
**దశాబ్దాల కల సాకారం...**
**ఏపీ గవర్నమెంట్ గ్రీన్ సిగ్నల్ ఫర్ రామాయపట్నం పోర్ట్..**

కొన్నేళ్లుగా వినిపిస్తూనే ఉన్న మాటలివి. కొన్నాళ్లుగా ఊపందుకుంటున్న వ్యాఖ్యలు కూడా.

మరి... దశాబ్ద కాల పోరాటంలో సాధించింది ఏమిటి? సాధించిందెవరు? నిజానికి ఇది ఎవరి పోరాటం? చివరికి ఈ పోరాటంలో సాధించింది ఎంత? ఇలా ప్రశ్నలు వేసుకుంటూ పోతే... ప్రశ్నలే మిగులుతున్నాయి. ఇవిగో సమాధానాలు అని చెప్పే గైడ్ ఏదైనా ఉందా?

ఎప్పుడో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోర్ట్ కమ్ షిప్‌యార్డ్‌ను మంజూరు చేసింది కేంద్రప్రభుత్వం. తూర్పు తీరంలో రెండు మెగా పోర్టుల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో ఒకటి పశ్చిమ బెంగాల్, మరొకటి ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించారు. బెంగాల్ రాష్ట్రం ఈ విషయంలో తక్షణమే స్పందించి 'సాగర్' అనే దీవిని ఎంపిక చేసిచ్చేసింది. పోర్ట్ కమ్ షిప్‌యార్డు నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా క్లియర్ చేసిచ్చింది. అక్కడ నిర్మాణాలు మొదలయ్యి, దాదాపు ఎనభై శాతం పనులు పూర్తయ్యాయి. మరి మన రాష్ట్రం పరిస్థితేమో 'అంగట్లో అన్నీ ఉన్నాయి... కానీ అల్లుడి నోట్లో శని ఉంది' అన్నట్లు అయింది. 'మీ రాష్ట్రంలో ఒక ప్రదేశాన్ని సూచించండి' అని కేంద్రం అడిగినప్పుడు మన ప్రభుత్వం 'రైట్స్' కమిటీ వేసింది. ఆ కమిటీ రామాయపట్నం, దుగరాజపట్నం, వైజాగ్ సమీపంలో ఉన్న గంగవరం తీరాలను పరిశీలించింది. గంగవరం పోర్టు నిర్మాణానికి భద్రత కారణాల రీత్యా నేవీ రక్షణదళం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దుగరాజపట్నంలో నిర్మిస్తే ఎదురయ్యే ఇబ్బందులను 'షార్' సెంటర్ ఏకరువు పెట్టింది. దీనికి తోడు పులికాట్ సరస్సు- నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రం మనుగడ కష్టమని పర్యావరణ అభ్యంతరాలు కూడా ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం రామాయపట్నం పేరును ఖరారు చేసి కేంద్రానికి పంపించింది కూడా. అయితే స్థానిక ఎంపీ మరో అరవై మంది ఎంపీలతో అప్పటి ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌ని కలిసి దుగరాజపట్నానికి అనుమతులు జారీ చేయించారు. ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులూ జరిగిపోయాయి. షార్ సెంటర్ మీద అప్పటి స్థానిక మంత్రులు ఒత్తిడి తేవడంతో కొన్ని షరతులతో అంగీకారం తెలిపింది షార్. ఇదంతా జరిగేటప్పటికి ఎన్నికలు రావడంతో ఆ ప్రయత్నం అక్కడే ఆగిపోయింది. ఇది 2014 ఎన్నికల వరకు జరిగిన పోర్టు.... మెగాపోర్టు సినిమా. ఎన్నికల తర్వాత వచ్చిన మోదీ ప్రభుత్వం కూడా మెగా పోర్టు విషయంలో మన్మోహన్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొనసాగించడానికే సిద్ధమైంది. తొలి బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. అయినా కూడా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూముల సేకరణ, ఇతర అనుమతుల గురించి దృష్టి పెట్టనేలేదు.

## ధర్మాగ్రహమే...

రామాయపట్నం అంటే... రైట్స్ కమిటీ సూచించిన మిగిలిన మూడో ప్రత్యామ్నాయం మాత్రమే కాదు. మిగిలిన రెండూ కొట్టివేతకు గురయ్యాయి కాబట్టి తప్పని సరి పరిస్థితుల్లో రామాయపట్నం వైపు మొగ్గు చూడడం కూడా కాదు. రామాయపట్నానికి మెగాపోర్టు నిర్మాణానికి అవసరమైన సౌలభ్యాలన్నీ ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మీనమేషాలు లెక్క పెడుతోంది. అప్పుడు నిద్రలేచింది... సామాన్యుడిలో ధర్మాగ్రహం. ప్రజా ఉద్యమం పెల్లుబికింది. రైతులు, మహిళలు ఉద్యమించారు. ప్రజా శ్రేయస్సు కోసం ముందుకు వచ్చిన నాయకులతో పథం వేశారు, పాదం కలిపారు. కలిగోళమ్మ సాక్షిగా పాతిక కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేశారు. కావలి పట్టణం నుంచి రామాయపట్నం వరకు సాగిన పాదయాత్రలో కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు పూరించిన శంఖారావానికి నెల్లూరు, ఒంగోలు ఎంపీలు మేకపాటి, వైవీ సుబ్బారెడ్డి సహనినాదం చేశారు. కావలి సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డితోపాటు వైసీపీ ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు ముందుండి నడిపించిన ప్రజాఉద్యమం అది. అస్పష్టంగా ఒక బంగారు కలకు రూపం తెచ్చిన ఉద్యమం అది.

## పోరు పెరిగింది-పోర్టు చేజారింది

రామాయపట్నంలో మెగాపోర్టు కమ్ షిప్‌యార్డు సాధన కోసం నెల్లూరు జిల్లా నుంచి మొదలైన ఉద్యమానికి ప్రకాశం జిల్లా స్వాగతం పలికింది. కొనసాగింపు ఉద్యమాలు అనేకం చేసింది. స్థానిక నాయకులు, చిన్న-సన్నకారు రైతులు, రైతుకూలీలు, చిన్న వ్యాపారులు, మహిళలు... కలెక్టరేట్ ముందు ధర్నాలు చేశారు. పార్టీలకతీతంగా నాయకులందరినీ ఏకతాటి మీదకు తెచ్చిన ప్రజా ఉద్యమం ఇది. మెగాపోర్టు కమ్ షిప్‌యార్డు ప్రాజెక్టు ప్రాథమిక బడ్జెట్ 27 వేల కోట్ల రూపాయలు. ఒంగోలు ఎంపీ పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాత మోదీ ప్రభుత్వం సమగ్రంగా సమీక్ష చేసింది. రామాయపట్నం ప్రతిపాదనకు సుముఖత వ్యక్తం చేసింది కూడా. ఇదంతా జరిగేనాటికి కేంద్ర ప్రభుత్వానికి-రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సఖ్యత లోపించింది. పార్టీల మధ్య దూరం పెరిగింది. కేంద్రం దగ్గర తన రాష్ట్ర ప్రయోజనాల గురించి డిమాండ్ చేయలేని సంక్లిష్టత అప్పటి రాష్ట్రప్రభుత్వానిది. అప్పటి వరకు రామాయపట్నం పోర్టు విషయంలో ఉదాసీనంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి ముంచుకొస్తున్న ఎన్నికలు గుర్తుకు వచ్చాయి. 'రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుంది' అని ప్రకటించింది. ఆ ప్రకటన, హడావుడిగా శంకుస్థాపన చేయడం అన్నీ కూడా మెగా పోర్టు కమ్ షిప్ యార్డుకు కాదు, మూడు వేల కోట్లతో పూర్తయ్యే నాన్ మేజర్ పోర్టు కోసం మాత్రమే. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ ప్రయత్నం కూడా శిలాఫలకానికే పరిమితమైంది.

## కొండంత పోరాటం

రామాయపట్నంలో మెగా పోర్టు కమ్ షిప్‌యార్డు కోసం చేసిన పోరాటం చిన్నది కాదు. కొండంత పోరాటం అది. చెన్నై, కృష్ణపట్నం, వైజాగ్‌లలో ఉన్నంత పెద్ద పోర్టు కోసం పోరాటం జరిగింది. ఇప్పుడు రామాయపట్నంలో మరోసారి శంకుస్థాపనకు సిద్ధమవుతున్న పోర్టు ఏది? ఎన్ని బెర్తులు ఉంటాయి, ఏకకాలంలో ఎన్ని వెసెల్స్ (నౌకలు) తీరాన లంగరు వేయగలుగుతాయి. ఈ పోర్టుకు అనుబంధంగా ఎన్ని వ్యాపారాలు విస్తరిస్తాయి? అన్నీ సమాధానం వెతుక్కోవాల్సిన ప్రశ్నలే. మెగా పోర్టు కమ్ షిప్‌యార్డు అయితే కంటెయినర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, రిపేర్ యూనిట్‌లు, పెట్రో కెమికల్ యూనిట్‌లు వచ్చేవి. వీటి కోసం పార్కింగ్ లాట్‌ల అవసరమూ ఉంటుంది. ఇంకా సరుకు రవాణా కోసం ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు లెక్కలేనన్ని వచ్చేవి. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి పైగా ఉపాధి లభించేది. ఇంత చెప్పుకున్నాం. ఇంతకీ ఇప్పుడు రామాయపట్నంలో నిర్మిస్తున్న పోర్టు ఏది? ఈ ప్రశ్నకు బదులివ్వాల్సిన మంత్రులు 'ఆ ఒక్కటీ తక్క' అన్నీ చెప్తున్నారు. ఎట్టకేలకు శంకుస్థాపనకు నోచుకుంటోందని, మన బతుకులు బాగుపడతాయని ప్రకాశం, ఉత్తర నెల్లూరు జనం నమ్ముతున్నారు. వారికి మిగిలేది ఆ నమ్మకమేనా? లేక ఇది చివరికి భేతాళ కథగానే మిగిలేనా?...

రోజుకోసారైనా..

# నీళ్ళివ్వండి మహాప్రభో!



- దాహంతో గిరిజనుల ఆక్రందన
- పట్టించుకోని అధికారులు

**అసలే కరోనా కాలం. ఇల్లు వదిలిపెట్టి బయటకు వెళ్లాలంటేనే భయం. అట్లని ఇంట్లో కూర్చుంటే మంచినీళ్ళు కూడా దొరకడం లేదు. ఇంకెలా బతకాలి?.. చిట్టమూరు మండలంలోని ఎల్లసిరి దిగువ గిరిజన కాలనీవాసుల ఆవేదన ఇది.**

గత కొద్ది రోజులుగా చిట్టమూరు మండలం, ఎల్లసిరి దిగువ గిరిజన కాలనీలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా పట్టించుకునే నాథులు లేరు. అసలు తాగేందుకు మంచినీళ్లు లేకుండా ఎలా బతకాలి? మా కాలనీకి రోజుకోసారైనా నీళ్ళివ్వండి మహాప్రభో!.. అని గిరిజనులు ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నా వినేవారు లేరు. గిరిజనులకు మంచినీళ్ళ సమస్యలే కాదు, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కలిగించడమే తమ ధ్యేయమని అధికారులు, పాలకులు పదేపదే గొప్పలు చెప్పుకుంటూ కాలం గడిపేస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం గిరిజనుల కష్టాలు తీరడం లేదు.

ఎల్లసిరి దిగువ గిరిజనకాలనీకి పైపుల ద్వారా నాలుగురోజులకోసారి మంచి నీళ్ళు వస్తుంటాయి. అవి కూడా ఎప్పుడు వస్తాయో చెప్పలేం!.. ఏ అర్ధరాత్రో అపరాత్రో వస్తే వస్తాయి. లేకుంటే లేదు. అసలు ఆ నీళ్ళెప్పుడు వస్తాయోనని గిరిజనులు పగలురాత్రి కంటికి నిదురలేకుండా ఎదురుచూడాల్సిన దయనీయ పరిస్థితి. ఈ బాధలు భరించలేక, మహిళలు.. వృద్ధులు విధిలేని పరిస్థితుల్లో మరింత కష్టపడు తూనే.. ఎక్కడో దూరప్రాంతంలోని మల్లాం రోడ్డుపక్కన ఉన్న పంటకాలువల వద్దకు వెళ్ళి కడవలు, బిందెలతో నీళ్ళు పట్టుకుని తెచ్చుకోవాల్సివస్తోంది. ఇలా రోజూ వెళ్ళి నీళ్ళు మోసుకుని తెచ్చుకోవాలంటే ఎంత కష్టమో ఆలోచించండి!..గొంతు తడుపు కునేందుకు గుక్కెడు నీళ్ళు కూడా లేక గిరిజనులు ఇంతగా అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో గిరిజనులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఇకనైనా జిల్లా కలెక్టర్ తదితరులు ఒక్క ఎల్లసిరి దిగువ గిరిజన కాలనీనే కాదు, జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గిరిజనుల కాలనీల్లోని పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించి వారి సమస్యలు తీర్చేందుకు వెంటనే అధికారులతో బృందాలను నియమించి, ఆ దీనజనుల కష్టాలను తీర్చి ఆదుకోవాల్సి ఉంది.

నిబంధనలు పాటించని

## ఆసుపత్రి సీజ్

**- మరో 9 ఇండోర్ స్టేడియంలు కూడా మూత**

నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ నగరంలోని పలు ఆసుపత్రులను ఈనెల 15న తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో కరోనా నియంత్రణ నిబంధనలు పాటించడం లేదని గుర్తించి అశ్వని న్యూరో కేర్ ఆసుపత్రిని సీజ్ చేసి నోటీసులిచ్చారు. అదే విధంగా కొండాయపాళెం గేటు, పోలీసు క్రీడామైదానం, జగదీష్‌కాలనీ తదితర ప్రాంతాల్లోని ఇండోర్ స్టేడియంలను కూడా పరిశీలించి, మొత్తంగా 9 ఇండోర్ స్టేడియంలను మూసివేయించారు.

'సంజీవని'

## బస్సులు వచ్చేశాయ్

నెల్లూరు రీజియన్‌కు మూడు సంజీవని బస్సులు వచ్చాయి. కరోనా తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో పరీక్షలు చేసేందుకు ఈ బస్సులు మొబైల్ పరీక్షా కేంద్రాలుగా సేవలందించనున్నాయి. ఈ రీజియన్‌కు ప్రభుత్వం 5 బస్సులను కేటాయించిందని, వీటిలో 3 బస్సులు ఈనెల 15న నెల్లూరుకు చేరుకున్నాయని ఆర్టీసి ఆర్ఎం పివి శేషయ్య తెలియజేశారు. మరో రెండురోజుల్లో మిగిలిన రెండు బస్సులు కూడా వస్తాయన్నారు. కరోనా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు ఈ బస్సుల్లో వైద్యసిబ్బంది వెళ్ళి పరీక్షలు చేస్తారు. మారుమూల ప్రాంతాల్లో కూడా పరీక్షలు చేసేందుకు ఈ బస్సులు వెళ్తాయి.

శ్రీ సత్యానందాశ్రమ ద్వితీయ

## ఆస్థానపండితునిగా కోట రాజశేఖర్



అల్లూరు రామకృష్ణా జూనియర్ కళాశాలలో సంస్కృత ఉపన్యాసకునిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ కోవూరు మండలంలోని ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానందాశ్రమానికి ద్వితీయ ఆస్థాన పండితునిగా నియమితులయ్యారు. ఇప్పటికే ఈ ఆశ్రమానికి ఎంతోకాలంగా ప్రముఖ సాహితీవేత్త డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు ఆస్థాన పండితునిగా ఉన్నారు. ఇటీవల ఆశ్రమంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాజశేఖర్ భాగవత ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థ స్వామీజీ అభినందించి ఈ ఆశ్రమానికి రెండవ ఆస్థానపండితునిగా కోట రాజశేఖర్ ఉంటారని ప్రకటించి ఆశీర్వదించారు. ఎంతో సౌమ్యుడు, ఆధ్యాత్మికవేత్త అయిన రాజశేఖర్‌కు ఈ గౌరవం దక్కడం పట్ల జిల్లాలోని పలువురు ఆధ్యాత్మిక, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు సంతోషం ప్రకటించారు.

## బాలలకు పుస్తక నేస్తాలు

కరోనా వైరస్ నేపథ్యంలో పాఠశాలలు ప్రారంభించడానికి ఆలస్యమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు 'పుస్తక నేస్తం' పేరుతో 82 పుస్తకాలను జిల్లాకు సరఫరా చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ చినవీరభద్రుడు ఈనెల 15న జిల్లా విద్యాశాఖకు మార్గదర్శకాలు జారీచేశారు. వీటిని ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేసి ఇళ్ళ వద్ద వీటిని చదువుకునేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

## మాస్కు లేకుంటే.. మద్యం ఇచ్చేది లేదు

కరోనా నేపథ్యంలో అందరూ మాస్కు ధరించి కరోనా నియంత్రణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కు లేకుంటే మద్యం ఇచ్చేది లేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. మాస్కు ధరించి, సామాజిక దూరం పాటిస్తేనే మద్యం ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. మాస్కు లేకుండా విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

# కరోనాతో కలబడదాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలను కూడా లెక్కచేయకుండా కరోనా బాధితుల ప్రాణాలు కాపాడేందుకు రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు. కరోనాను చూసి భయపడకుండా ఎదురొడ్డి పోరాడుతూనే ఉన్నారు. వ్యాధిగ్రస్తులకు తమ ప్రాణాలను అడ్డుపెడుతున్నారు. ఈ వ్యాధికి గురైన ఎంతోమందిని కోలుకునేలా చేస్తున్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఇంతకన్నా భరోసా మనకెవరిస్తారు?...

## ఆత్మస్థైర్యమే మందు :

ఆత్మస్థైర్యంతో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలే తప్ప వ్యాధికి భయపడడం అనవసరం. ఇదే కాదు ఎంతటి కష్టం వచ్చినా, విపత్తు ఎదురైనా మనోధైర్యంతోనే ముందుకు సాగాలి. ధైర్యంతోనే జీవించాలి. అప్పుడే ఇలాంటి కరోనాలు మనల్ని ఏమీ చేయలేవు. ఈ వ్యాధి మన ప్రాంతానికే కాదు, ప్రపంచమంతా ఉంది. ఇది ఇప్పట్లో పోతుందని కూడా చెప్పలేం. వ్యాక్సిన్ వచ్చేదాకా ఎదురుచూడాల్సిందే. అందువల్ల ఈ వ్యాధిని అరికట్టేందుకు ప్రతి పౌరుడూ ఒక సైనికుడు కావాల్సిందే. మనల్ని మనమే నిర్బంధించుకుని స్వీయ నిర్బంధంలో ఉంటూ ప్రభుత్వాలు చెప్పిన్న విధంగా అన్ని విధాలైన ముందు జాగ్రత్తలు తీసుకుంటే కరోనాను జయించవచ్చని అందరూ గుర్తించాలి.

## ముందు జాగ్రత్తలతోనే కట్టడి

ముందు జాగ్రత్తలతోనే కరోనాను కట్టడి చేయవచ్చు. ప్రభుత్వాలు సూచించిన విధంగా అందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. స్వీయనిర్బంధంలో ఉండాలి. అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి బయటకు రాకూడదు. ఒకవేళ వచ్చినా వీధుల్లో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. గుంపులుగా ఉండకూడదు. సామాజిక దూరం, ఇళ్ళల్లో కూడా భౌతిక దూరం పాటించాలి. తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. శానిటైజేషన్‌తో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీటితో పాటు వ్యాధినిరోధకశక్తిని పెంపొందించుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవాలి. యోగా, ప్రాణాయామం వంటి వాటిని అనుసరించాలి. అలాకాక, చిత్తం వచ్చినట్లు వ్యవహరిస్తే ఎవరూ చేసేదేమీ ఉండదు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వ్యాధి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి. తస్మాత్ జాగ్రత్త!..ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. మనల్ని మనం కాపాడుకుంటూ, మన కుటుంబాల్ని, భార్యా బిడ్డల్ని, మన స్నేహితుల్ని సన్నిహితుల్ని అందర్నీ కాపాడుకోవాలంటే తప్పదు.. జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!...ప్రపంచంలో కోట్లాదిమందికి వస్తున్న ఈ వ్యాధి మన దాకా రాకుండా ఎవరికి వారు స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలి.

## దేశవ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన వ్యాధినివారణ చర్యలు :

ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఏమి చేయాలో అంతా ముమ్మరంగా చేస్తూనే ఉన్నాయి. ఈ మహమ్మారిని ముందుగానే గమనించి సరైన సమయంలో దేశంలో లాక్‌డౌన్ విధించి కరోనాని కట్టడిచేసిన ప్రధాని మోడీ, రాష్ట్రంలో ఈ వ్యాధి వ్యాప్తిని అరికడుతూ సకల చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎంతైనా అభినందనీయులు. ప్రత్యేకించి అప్పటికప్పుడు తక్షణ సౌకర్యాలను, కోవిడ్ ఆసుపత్రులను రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఏర్పాటు చేయడమంటే చిన్న విషయం కాదు.

ఈ ప్రాణాంతకమైన వ్యాధికి చికిత్సలు చేసే వైద్యులు సాక్షాత్తూ దేవుళ్ళే. వారు తమ ప్రాణాలను సైతం లెక్కపెట్టకుండా కరోనా వ్యాధిగ్రస్తులకు ప్రాణాలు పోస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వాలు, మరో వైపు వైద్యులు, ఇంకోవైపు పోలీసులు, ఇతర అధికారులు అందరూ అన్నివేళలా బాధితులకు అండగా ఉంటున్నారు. ఈ వ్యాధికి భయపడడం కాక, ధైర్యంగా ఉంటూ ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యమని చెప్తూనే ఉన్నారు.

## కరోనా కట్టడికి నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్రప్రభుత్వం

రాష్ట్రంలోనూ కరోనా విజృంభిస్తూనే ఉంది. కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. కరోనా బాధితులను వెంటనే గుర్తించేందుకు, వారికి తక్షణ చికిత్సలందించేందుకు సకల చర్యలు తీసుకుంటోంది. బాధితులను ఈ మహమ్మారి వ్యాధి బారిన పడకుండా చేసేందుకు వైద్యులు, వైద్యసిబ్బంది కంటికి నిద్ర లేకుండా శ్రమిస్తూనే ఉన్నారు. దీంతో కరోనా నియంత్రణలో మంచి ఫలితాలనే సాధిస్తున్నాం. కరోనా పరీక్షలు చేయించడంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉంటూ ఇప్పటికే 12 లక్షల మైలురాయిని కూడా దాటింది.

ఈనెల 15న ఒక్కరోజే 22,197 మందికి పరీక్షలు చేశారు. దీంతో పరీక్షలు చేయించుకున్నవారి సంఖ్య 12,17,963కు చేరిందంటే ప్రభుత్వం బాధితులను గుర్తించి, తక్షణం వారిని ఈ వ్యాధి నుంచి బయటవేసేందుకు ఎంతగా కృషిచేస్తోందో అర్థమవుతుంది. ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకున్నవారి సంఖ్య కూడా 18,378కి చేరుకుంది. కరోనా కేసులు ఈనెల 15 అర్ధరాత్రి సమయానికి 35,451కి చేరుకున్నాయి. మొత్తం మరణాల సంఖ్య 452కు చేరుకుంది.

## బాధితుల పట్ల, మృతుల పట్ల నిరాదరణ తగదు :

కరోనా బాధితుల పట్ల, మృతుల పట్ల ఎవరూ నిరాదరణతో చూడకూడదు. అమానవీయంగా వ్యవహరించకూడదు. మానవతా దృక్పథంతో ఉండాలే తప్ప బాధితుల పట్ల తిరస్కారభావంతో ఉండడం మానవత్వం అనిపించుకోదు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఇటీవల అధికారులతో మాట్లాడుతూ కరోనాతో మరణించినవారి అంత్యక్రియల పట్ల ఎవరూ అమానవీయంగా ప్రవర్తించకూడదని గట్టిగా హెచ్చరించారు. అంతే కాదు మృతుల అంత్యక్రియలకు 15 వేల రూపాయలు ఆర్థిక చేయూతనివ్వాలని కూడా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయించి తన మానవీయతను చాటుకున్నారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జిల్లాల్లో కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని కూడా సిఎం ఆదేశించారు. ఈ విపత్తు సమయంలో కోవిడ్ బాధితుల ప్రాణాలను రక్షించేందుకు ప్రాణాలకు తెగించి చికిత్సలందిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది సేవలను గుర్తించాలని, వారికి మెరుగైన జీతాలివ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అవసరాలకు తగినట్లుగా వైద్యులను, సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఇప్పటికే 17వేల మందికిపైగానే వైద్యులు, మరో 12 వేల మంది నర్సులను నియమించేందుకు అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి వెంటనే ఆమోదించారు. కరోనా బాధితులకు తక్షణ వైద్యం అందించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ వైద్యాన్ని నిరాకరించకూడదని, అలా చేసినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులతో పాటు ఆసుపత్రుల అనుమతులు కూడా రద్దుచేయాలని సిఎం గట్టిగా హెచ్చరించారు. కరోనా నియంత్రణ చర్యల్లో ఏమాత్రం వెనుకబాటు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇలా ప్రభుత్వాలు, అన్ని శాఖల అధికారులు, వైద్యనిపుణులు, పోలీసులు, స్వచ్ఛంధసేవకులు, ఎందరో మానవతావాదులు కరోనా నిరోధానికి ప్రతిక్షణం కృషి చేస్తూనే ఉన్నారు. ఈ రాకాసి వ్యాధిని త్వరలోనే అంతం చేసేందుకు ప్రపంచంలోని ప్రఖ్యాత శాస్త్రవేత్తలంతా రేయింబవళ్ళు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. వారి శ్రమ ఫలించే రోజు దగ్గరలోనే ఉంది. అంతదాకా.. ఎవరూ భయపడకుండా.. ధీరోదాత్తంగా కరోనాను ఎదుర్కొందాం!.. గుండె ధైర్యంతో.. ముందుజాగ్రత్తలు తీసుకుంటూ.. కరోనాను జయిద్దాం!....

# పెరగనున్న జిల్లాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే జరిగితే నెల్లూరుకు అన్నివిధాలుగా నష్టమే. 2014లో 7సీట్లతోను, 2019లో మొత్తం 10కి 10 సీట్లతోను జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించిన జిల్లాకు అన్యాయం జరగదనే అశాభావం జిల్లావాసులలో వుంది. అలాకాకుండా పైన తెలిపిన ప్రకారమే జరిగితే ఇటు జిల్లా ఆర్థిక ప్రగతితో పాటు ప్రస్తుత నేతల ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు కూడా నష్టమే. జరగాల్సిన నష్టం జరిగి జిల్లాలో మరో ఉద్యమం ఉపిరిపోసుకోక ముందే జిల్లా నాయకత్వమంతా తమ అభిప్రాయాలని జిల్లా ప్రజల ఆకాంక్షలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలన్నది మేధావుల సూచన. అతి క్లిష్టమైన ఈ సమస్యను ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కమిటీ ఏ విధంగా పరిష్కరిస్తుందో వేచి చూడాలి.

***బుధవారం నాడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలు...***

## జిల్లాల పునర్వ్యవస్థీకరణ

రాష్ట్రంలో 25 జిల్లాల ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాల ఏర్పాటులో ఖర్చును నియంత్రించడం సహా వివిధ అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో ఏర్పడే ఈ కమిటీలో సభ్యులుగా సీసీఎల్ఏ కమిషనర్, జీఏడీ సర్వీసుల సెక్రటరీ, ప్లానింగ్ విభాగం సెక్రటరీ, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రతినిధి ఉండడంతో పాటు కన్వీనర్‌గా ఫైనాన్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వుంటారు. కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా పాలనా సౌలభ్యంతోపాటు, ప్రభుత్వం ప్రజలకు వీలైనంత చేరువగా ఉండేందుకు దోహదపడుతుందన్నది ప్రభుత్వ ఆలోచన.

## వైయస్సార్ చేయూత

ఇప్పటికే పెన్షన్ అందుకుంటున్న వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులైన మహిళలు తదితర కేటగిరీ మహిళలకూ చేయూత పథకం వర్తింపుకు కేబినెట్ నిర్ణయించింది, ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే పెన్షన్ అందుకుంటున్నవారిలో అదనంగా రూ. 8.21 లక్షలమందికి లబ్ది కలుగుతుంది. వైయస్సార్ చేయూత కింద 45–60 ఏళ్ల మధ్యనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు నాలుగేళ్లలో నాలుగు విడతల్లో రూ. 75వేల రూపాయలు ప్రభుత్వం అందించబోతోంది. ఏడాదికి రూ. 1540.89 కోట్ల చొప్పున నాలుగేళ్లకు సుమారు రూ. 6163.59 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మహిళల ఉపాధి, జీవన ప్రమాణాలను పెంచడంలో ఈ పథకం బాగా ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావన.

## మరింత పటిష్టంగా నాడు–నేడు

నాడు – నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీలలో నాడు – నేడు కింద వసతులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించారు.

## ప్రభుత్వ, ప్రైవేట్ ఆధ్వర్యంలో పవర్ ప్లాంట్లు

10వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడానికి వీలుగా ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్ యాక్ట్–2006 (కన్వర్షన్ ఫర్ నాన్ అగ్రికల్చర్ పర్పస్) సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపి, దీనిపై ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయించింది. 10వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం, రైతులకు పగటి పూట ఉచిత కరెంటు ఇచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఈ కీలక ప్రాజెక్టులను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. తక్కువ ఖర్చుకు కరెంటు వచ్చేలా, ప్రభుత్వంమీద ఆర్థిక భారం తగ్గేలా ఒప్పందానికి ఆమోదం తెలిపి 25 ఏళ్లకు పీపీఏ కుదుర్చుకోవాలని నిర్ణయించింది.

## ఏపిఐఐసికి రుణానికి అనుమతి

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి త్వరితగతిన జరిగే దిశగా అడుగులు వేస్తూ రూ. 2వేల కోట్ల రుణం తెచ్చుకునేందుకు ఏపీఐఐసీకి అనుమతి ఇచ్చి ఆ రుణానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడానికి నిర్ణయించింది.

## ఆక్వా రంగానికి నకిలీ మేత బెడద నుండి విముక్తి

ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫీడ్ క్వాలిటీ కంట్రోల్ యాక్ట్ ప్రవేశ పెట్టి దీనిపై ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురానుంది. ఆక్వారైతులకు నకిలీ ఫీడ్‌ల బెడదనుంచి విముక్తి కలిగించి, ఈ యాక్ట్ ద్వారా అనైతిక చర్యలకు అడ్డుకట్ట వేసేదిశగా చర్యలు చేపట్టనుంది.

## ఇసుక కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్

రాష్ట్రంలో ఇసుక సరఫరాకు సంబంధించి అనేక ఫిర్యాదులు అందుతుండడంతో, ఇసుకకు సంబంధించిన వ్యవహారాలను చూడడానికి ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఏపీఎండీసీ కిందే ఇసుక కార్పొరేషన్ కూడా ఉండగా ఇప్పుడు దానిని వేరు చేసి ఏపీఎండీసీకి పనిభారాన్ని తగ్గించేదిశగా ఇసుక కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తోంది జగన్ సర్కార్. ఇసుక కార్పొరేషన్‌పై ముగ్గురు మంత్రుల కమిటీ పర్యవేక్షణ ఉండేలా ప్రణాళిక రూపొందించి, ఎప్పటికప్పుడు ఈ ముగ్గురు మంత్రుల కమిటీ తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం ఆలోచన చేసి కమిటీలో కొడాలి నాని, పేర్ని నాని, బుగ్గన రాజేంద్రనాథ్‌లను నియమించింది.

## భారీగా వైద్య ఉద్యోగాల భర్తీ..

దేశ చరిత్రలోనే తొలిసారిగా భారీ ఎత్తున వైద్యుల పోస్టుల నియామకాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపి, 9712 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 5701 కొత్త పోస్టుల భర్తీతోపాటు చాలా కాలంగా భర్తీ కాకుండా ఉన్న 4011 పోస్టులను కూడా ఇప్పుడు భర్తీ చేస్తారు.

ఈ సమావేశంలో వీటితోపాటు ఇంకా అనేక ప్రజా ప్రయోజక నిర్ణయాలు తీసుకున్నారు.

# చక్రధర్‌బాబుకు కొలువు

(మొదటి పేజీ తరువాయి)

పాలనాపరంగా ముక్కుసూటిగా వ్యవహరిస్తూ ఆయన మంచిపేరు తెచ్చుకున్నారు కూడా. అప్పట్లో ఒక నిర్మాణ విషయంలో ఆయనపై తీవ్ర రాజకీయ వత్తిడులు వచ్చినా ఆయన లొంగకపోవడంతో ఆయనపై బదిలీ వేటు వేశారు.

ఇప్పటిదాకా జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన ఎంవి శేషగిరిబాబుకు ప్రభుత్వం ప్రస్తుతం పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన్ను జిఏడిలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2019 జూన్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న శేషగిరిబాబు ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలుచేయడంలో ముందుండేవారు. కరోనాను నియంత్రించడంలో కూడా ఆయన అధికారులను పురమాయించి పనిచేయిస్తూ రేయింబవళ్ళు శ్రమించారు. అయితే రాజకీయంగా వచ్చిన ఒత్తిళ్ళతో ఆయన తనకు తనే బదిలీ కోరుతూ ప్రభుత్వానికి విన్నవించుకుని, ఇటీవల సెలవు పెట్టారు. ఏదేమైనా జిల్లాపైనా, ప్రత్యేకించి నెల్లూరు నగరం పరిస్థితిపైనా బాగా అవగాహనతో పాటు, ముక్కుసూటి మనస్తత్వం కలిగిన నిజాయితీపరుడైన అధికారిగా పేరున్న చక్రధర్‌బాబు పాలనలో జిల్లా సమస్యల నుంచి గట్టెక్కి మంచి పురోగతి సాధిస్తుందని ఆశిస్తూ..కొత్త కలెక్టర్‌కు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు అందిస్తోంది.. 'లాయర్'!..

# కొత్త జిల్లాలు వస్తే... ఇలా ఉండొచ్చు!

*రాష్ట్రంలో కొత్తజిల్లాలు ఏర్పడితే వాటి స్వరూపం దిగువ కనపరచిన విధంగా వుండబోతోందన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. రాష్ట్రంలో ఇప్పుడున్న 13 జిల్లాలను ప్రభుత్వం 25 జిల్లాలుగా పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అవసరమైతే మరో జిల్లాను కూడా అదనంగా ఏర్పాటుచేసే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలు, వాటిలో కలిసే ప్రాంతాలు బహుశా ఇలా ఉండవచ్చునే అంచనాలు సర్వత్రా వినిపిస్తున్నాయి....*

**1) అరకు**

కురుపాం, పార్వతీపురం, సాలూరు, మాడుగుల, అరకు లోయ, పాడేరు, రంపచోడవరం.

**2) శ్రీకాకుళం**

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట

**3) విజయనగరం**

ఎచ్చెర్ల, రాజాం, పాలకొండ, బొబ్బిలి, చీపురుపల్లి, భోగాపురం, విజయనగరం.

**4) విశాఖపట్నం**

గజపతినగరం, శృంగవరపుకోట, భీమిలి, తూర్పు విశాఖపట్నం, దక్షిణ విశాఖపట్నం, ఉత్తర విశాఖపట్నం, పశ్చిమ విశాఖపట్నం.

**5) అనకాపల్లి**

గాజువాక, చోడవరం, అనకాపల్లి, పెందుర్తి, ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం.

**6) కాకినాడ**

తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ గ్రామీణం, పెద్దాపురం, కాకినాడ నగరం, జగ్గంపేట.

**7) అమలాపురం**

రామచంద్రాపురం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, గన్నవరం, కొత్తపేట, మండపేట.

**8) రాజమండ్రి**

అనపర్తి, రాజానగరం, రాజమండ్రి నగరం, రాజమండ్రి గ్రామీణం, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం.

**9) నరసాపురం**

ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం.

**10) ఏలూరు**

ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు.

**11) మచిలీపట్టణం**

గన్నవరం, గుడివాడ, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ, ఉయ్యూరు, పెనమలూరు.

**12) విజయవాడ**

తిరువూరు, భవానీపురం, సత్యనారాయణ పురం, విజయవాడ పడమట, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట.

**13) గుంటూరు**

తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడు, గుంటూరు ఉత్తర, గుంటూరు దక్షిణ.

**14 నరసారావుపేట**

పెదకూరపాడు, చిలకలూరిపేట, నరసారావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, గురజాల, మాచెర్ల.

**15 బాపట్ల**

వేమూరు, రేపల్లె, బాపట్ల, పరుచూరు, అద్దంకి, చీరాల, సంతనూతల.

**16) ఒంగోలు**

ఎర్రగొండపాలెం, దర్శి, ఒంగోలు, కొండేపి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి.

**17) నంద్యాల**

ఆళ్ళగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, కల్లూరు, నంద్యాల, బనగానపల్లి, డోన్.

**18 కర్నూలు**

కర్నూలు, పత్తికొండ, కొడుమూరు, ఎమ్మిగనూరు, కౌతాళం, ఆదోని, ఆలూరు.

**19) అనంతపురం**

రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం, రాప్తాడు.

**20) హిందూపూర్**

సింగనమల. మడకసిర, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి.

**21) కడప**

బద్వేల్, కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు.

**22) నెల్లూరు**

కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, ఉదయగిరి.

**23) తిరుపతి**

సర్వేపల్లి, గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు.

**24) రాజంపేట**

రాజంపేట, కోడూరు, రాయచోటి, తంబళ్ళపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు.

**25. చిత్తూరు**

చంద్రగిరి, నగరి, గంగాధరనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు






శ్రీ పి.టి.రంగరాజన్ గారు

జననం : 06.09.1954 మరణం : 11.07.2020

స్వామియే శరణం అయ్యప్ప !

## శ్రద్ధాంజలి

నెల్లూరుజిల్లా 'అయ్యప్ప భక్తుల' ప్రత్యక్ష దైవం
వేలాదిమందికి ఇరుముడి సమర్పించిన 'గురుస్వామి'
మాకు మార్గదర్శకులు

**శ్రీ పి.టి.రంగరాజన్ స్వామి గారు**

తే. 11.07.2020ది శనివారం
అయ్యప్ప స్వామి పాదాల చెంతకు చేరినారు.

ఎల్లప్పుడూ మా గుండెల్లో నెలవై వుండే
ఆ మానవతామూర్తికి శ్రద్ధాంజలి ఘటిస్తూ...
వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
మా నివాళులు అర్పిస్తున్నాము.

ఇట్లు
**మణికంఠ భక్త సేవా సమాజం**
నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com